manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY



మీ కలానికి.. ఇదే వేదిక!

మన విశ్వం

జిల్లా ప్రతినిధులు

నియోజకవర్గ రిపోర్టర్లు

కావలెను

వార్త మీ బలం అయితే.. 'మన విశ్వం' మీ వేదిక!

630 563 8569

900 096 7680



వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 74 | ఆదివారం 30 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్




# ఉద్యమకారుల రుణం తీర్చుకోవాల్సిందే!

**గుర్తింపు ప్రక్రియలో జాప్యం వద్దు: సీఎం రేవంత్‌రెడ్డి**

**ప్రత్యేక పోర్టల్‌తో డిజిటల్ దరఖాస్తుల స్వీకరణకు ఆదేశం**

**250 గజాల స్థలం, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణంపై సానుకూలత**


**సీఎంకు ముసాయిదా నివేదిక అందించిన కేశవరావు కమిటీ**

**హైదరాబాద్, ఆగస్టు 29 (మన విశ్వం):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలకు తగిన గౌరవం ఇవ్వడంతోపాటు వారి రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యతని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో ఏమాత్రం జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్, పోర్టల్ ఏర్పాటు చేసి డిజిటల్‌గా దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ డాక్టర్ కె.కేశవరావు నేతృత్వంలోని బృందం శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్ పాల్గొన్నారు. ఉద్యమకారుల గుర్తింపు, వారికి

మిగతా 2లో..

# దామోదరా.. 'కమీషన్' స్కాన్ చేయండి!





## డయాగ్నోస్టిక్ దందాపై ఆరోగ్యశాఖ కొరడా ఝుళిపించాలంటున్న రోగులు

**పీఆర్వోలతో రిఫరల్స్..?**

**వైద్యులకు 'కట్' అంటూ ఆరోపణలు**

**సీటీకి ఓ లెక్క.. ఎంఆర్ఐకి మరో లెక్కగా కమీషన్లంటూ విమర్శలు**

**ఒకే టెస్టుకు కేంద్రానికో ధర.. సామాన్యుడి జేబుకు చిల్లు**

**'అనవసర రిఫరల్స్‌పై హెచ్చరించినట్లే.. ఈ దందాపైనా ఉక్కుపాదం మోపండి'**

**ప్రతి కేంద్రంలో ధరల బోర్డు.. రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలకు డిమాండ్**

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 29 (మన విశ్వం):** అనవసరంగా రోగులను పైస్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేస్తే సహించేది లేదని ఇటీవల అధికారులకు స్పష్టం చేసిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. ఇప్పుడు ప్రైవేటు డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో జరుగుతున్నాయంటున్న 'రిఫరల్ కమీషన్' వ్యవహారంపైనా దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. రోగాన్ని గుర్తించాల్సిన పరీక్షలే కొన్ని చోట్ల వ్యాపారంగా మారుతున్నాయని, పీఆర్వోల ద్వారా రిఫరల్స్ సంపాదించడం.. తమ వద్దకు రోగులను పంపే కొందరు వైద్యులకు పరీక్షను బట్టి కమీషన్ ముట్టజెప్పడం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే పరీక్షకు కేంద్రానికో ధర ఉండటం, సీటీ, ఎంఆర్ఐ వంటి పరీక్షలకు వేలల్లో ఫీజులు వసూలు చేస్తుండటంతో సామాన్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని బాధితులు వాపోతున్నారు.

**రిఫరల్ వెనుక 'కట్' ఉందా?**

వైద్యుడు సూచించాడంటే రోగి మరో ఆలోచన లేకుండా అదే డయాగ్నోస్టిక్ కేంద్రానికి వెళ్తాడు. వైద్యుడిపై రోగికున్న ఈ నమ్మకాన్నే కొన్ని కేంద్రాలు

మిగతా 2లో..



# తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

**ఉమ్మడి ఏపీ మాజీ సీఎంకు కీలక బాధ్యత**


**సుదీర్ఘ రాజకీయ, పరిపాలనా అనుభవానికి గుర్తింపు**

**రాష్ట్రపతి ఆమోదంతో నియామకం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 29 (మన విశ్వం):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కీలక రాజ్యాంగ పదవి దక్కింది. తమిళనాడు గవర్నర్‌గా ఆయన నియమితులయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదంతో ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. సుదీర్ఘ రాజకీయ, పరిపాలనా అనుభవం ఉన్న ఆయనకు కీలకమైన తమిళనాడు గవర్నర్ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం

మిగతా 2లో..

# 'బిడ్డా.. వారం రోజులే గడువు!'



**22ఏ నుంచి 50,565 ఎకరాలు తొలగించాల్సిందే..**

**సంగారెడ్డి కలెక్టర్‌కు హరీశ్‌రావు హెచ్చరిక**

**లేదంటే బాధితులతో సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి**

**'98శాతం పరిష్కారమైతే.. పటాన్‌చెరులో ఇన్ని ఎకరాలెందుకు?'**

**పటాన్‌చెరు, ఆగస్టు 29 (మన విశ్వం):** "కలెక్టర్ బిడ్డా.. వారం రోజులే గడువు. 22ఏ నిషేధిత జాబితాలో చిక్కుకున్న ప్రజల నిజమైన, వివాదరహిత భూములు.. ఇళ్లను వెంటనే బయటకు తీయాలి. లేదంటే బాధితులతో కలిసి సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం" అని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 50,565 ఎకరాలు 22ఏ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. వాటిపై వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి గడువు విధించారు. పటాన్‌చెరులో శనివారం 22ఏ బాధితులతో నిర్వహించిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ఏళ్ల తరబడి ప్రజల ఆధీనంలో ఉన్న ఇళ్లు, భూములు నిషేధిత జాబితాలో చేరడంతో రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు నిలిచిపోయాయని చెప్పారు. సొంత ఆస్తుల సమస్య పరిష్కారం కోసం ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని విమర్శించారు.

**50,565 ఎకరాలకు చిక్కుముడి**

గుమ్మడిదల, అమీన్‌పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు, జిన్నారం మండలాల్లో కలిపి 50,565 ఎకరాలు 22ఏ జాబితాలో ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. దాదాపు లక్ష ఇళ్లపైనా దీని ప్రభావం ఉందని పేర్కొన్నారు. భూములపై లావాదేవీలు నిలిచిపోవడంతో రైతులు, సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. "ప్రజల ఆస్తులకు ప్రభుత్వమే తాళం వేసి.. దాన్ని తీయించుకోవడానికి వారినే కార్యాలయాల చుట్టూ తిప్పడం ఏమిటి?" అని

మిగతా 2లో..

# ఒక్క ఓటూ గల్లంతు కావొద్దు!

**ఎస్ఐఆర్‌పై ఈసీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ**

**73.39 లక్షల మంది 'ఏఎస్‌డీడీ' జాబితాలో.. 92.86 లక్షల మందికి నోటీసుల పరిస్థితి**

**అభ్యంతరాల గడువు మరో నాలుగు వారాలు పెంచాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, ఆగస్టు 29 (మన విశ్వం):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) పేరుతో అర్హుడైన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి గల్లంతు కాకూడదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో అనర్హులకు జాబితాలో చోటు దక్కకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు. సవరణలో ఎదుర వుతున్న సమస్యలను వివరిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ఆయన లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులకు ప్రస్తుతం ఉన్న గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

**73.39 లక్షల మందిపై 'ఏఎస్‌డీడీ' ముద్ర!**

జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం)గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ('ఏఎస్‌డీడీ') ఓటర్లుగా గుర్తించినట్లు సీఎం పేర్కొన్నారు. వీరిలో 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం

మిగతా 2లో..



# వేపచెట్టు కోసం రక్తపాతం!

**గొడ్డళ్లతో రెండు వర్గాల పరస్పర దాడులు.. ఇద్దరి దుర్మరణం**

**ఒకరు అక్కడికక్కడే.. మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి**

**ఘర్షణను అడ్డుకోబోయిన ఎస్ఐపైనా దాడి.. ఎర్రగడ్డ తండాలో ఉద్రిక్తత**





వివరాలు 2లో..

# గడల.. నెట్టుకురాగలడా?

**ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో మాజీ హెల్త్ డైరెక్టర్**

**ప్రధాన పార్టీల కంటే ముందే అభ్యర్థిని ప్రకటించిన జనసేన**

**'గ్లాస్'కు పట్టభద్రుల ఆదరణ దక్కేనా?.. పవన్ క్రేజ్ ఓట్లుగా మారేనా?**



**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 29 (మన విశ్వం):** మూడు ఉమ్మడి జిల్లాలు.. విస్తారమైన నియోజకవర్గం.. లక్షలాది మంది విద్యావంతుల ఓట్లు.. బలమైన ప్రధాన పార్టీల మధ్య పోరు! ఈ రాజకీయ సమరంలో జనసేన తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమైంది. ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి

మిగతా 2లో..

# మూగజీవాల ఆసుపత్రికి 'నిర్లక్ష్య' రోగం!




**తాడిచర్లలో అధ్వానంగా ఆసుపత్రి పరిసరాలు**

**దెబ్బతిన్న తలుపులు, కిటికీలు..**

**ఇబ్బందుల్లో రైతులు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్**



**మల్హర్, ఆగస్టు 29 (మన విశ్వం):** మండల కేంద్రం తాడిచర్లలోని ప్రభుత్వ పశువైద్యశాల సమస్యలతో సతమతమవుతోంది. పశువులకు వైద్యం అందించడంతోపాటు మండలంలోని గ్రామాలకు మందులు సరఫరా చేసే ఈ కేంద్రంలో కనీస వసతులు కరవయ్యాయని రైతులు వాపోతున్నారు. ఆసుపత్రికి వెళ్లే రహదారి వర్షాలకు బురదమయంగా మారడం, భవనం తలుపులు, కిటికీలు దెబ్బతినడం, పరిసరాల్లో నీరు నిలవడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి.

**చినుకు పడితే చిత్తడే..**

కొద్దిపాటి వర్షానికే ఆసుపత్రికి వెళ్లే దారి బురదమయంగా మారుతోంది. అనారోగ్యంతో ఉన్న పశువులను తీసుకొచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో వర్షపు నీరు నిలిచి

మిగతా 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH


# హక్కుల రక్షణే నాగరికతకు గీటురాయి



ప్రపంచం సాంకేతికంగా పరుగులు తీస్తోంది. ఆర్థిక వ్యవస్థలు విస్తరిస్తున్నాయి. దేశాల మధ్య దూరాలు చెరిగిపోతున్నాయి. కానీ మనిషి స్వేచ్ఛగా, గౌరవంగా, భయం లేకుండా జీవించే పరిస్థితులు అదే స్థాయిలో మెరుగుపడ్డాయా అంటే సమాధానం అంత ఆశాజనకంగా లేదు. యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, రాజకీయ అణచివేతలు, జాతి-మత వివక్ష, పేదరికం కారణంగా ఇప్పటికీ ఎంతోమంది కనీస హక్కులకు దూరమవుతున్నారు. అభివృద్ధి ఎంత సాధించామన్నదానికంటే.. సాధారణ పౌరుడి హక్కులకు ఎంత రక్షణ కల్పిస్తున్నామన్నదే నాగరిక సమాజానికి అసలైన గీటురాయి.

జీవించే హక్కు, సమానత్వం, భావ ప్రకటనా స్వేచ్ఛ, విద్య, ఆరోగ్యం వంటివి ప్రభుత్వాలు దయతో ఇచ్చే వరాలు కావు. మనిషిగా జన్మించిన ప్రతి ఒక్కరికీ సహజంగా దక్కాల్సిన హక్కులు. రెండో ప్రపంచ యుద్ధం మిగిల్చిన విధ్వంసం తర్వాత ప్రపంచ దేశాలు ఈ సత్యాన్ని గుర్తించి మానవ హక్కుల పరిరక్షణకు అంతర్జాతీయ ప్రమాణాలను రూపొందించాయి. ఐక్యరాజ్యసమితి వేదికగా ఎన్నో ఒప్పందాలు కుదిరాయి. అయినా ఆచరణలో మాత్రం వాటి స్ఫూర్తికి విరుద్ధమైన పరిణామాలు కొనసాగుతుండటం ఆందోళనకరం.

ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఘర్షణలకు సామాన్యులే మూల్యం చెల్లిస్తున్నారు. ఇళ్లు, ఉపాధి కోల్పోయి లక్షల కుటుంబాలు శరణార్థులుగా మారుతున్నాయి. మహిళలు, చిన్నారులు హింసకు గురవుతున్నారు. బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా వంటి సమస్యలు ఇంకా వేధిస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడం, భిన్నాభిప్రాయాలకు అవకాశం లేకుండా చేయడం వంటి ధోరణులూ కనిపిస్తున్నాయి. హక్కుల పరిరక్షణపై ప్రకటనలు చేయడం మాత్రమే కాదు.. వాటిని ఆచరణలో నిలబెట్టే రాజకీయ సంకల్పం అవసరం.

ఇందులో ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యత. చట్టం ముందు అందరూ సమానులనే విశ్వాసాన్ని కల్పించాలి. న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భరోసా ఇవ్వాలి. అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలి. ప్రశ్నించే గొంతును శత్రువుగా చూడకుండా ప్రజాస్వామ్యానికి అవసరమైన భాగంగా గుర్తించాలి. విమర్శను సహించలేని వ్యవస్థలో స్వేచ్ఛ బలహీనపడుతుంది. భిన్నాభిప్రాయాలకు చోటున్నప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

మానవ హక్కుల విషయంలో అంతర్జాతీయ సమాజమూ ద్వంద్వ ప్రమాణాలకు తావివ్వకూడదు. రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను బట్టి ఒక దేశంలోని ఉల్లంఘనలపై స్పందించి.. మరోచోట మౌనం పాటించడం విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. బాధితుడు ఏ దేశం, జాతి, మతానికి చెందినవాడన్నది కాకుండా అతడూ మనిషేనన్న దృక్పథమే ప్రామాణికం కావాలి. హక్కుల ఉల్లంఘనలను అరికట్టడంలో అంతర్జాతీయ సంస్థలు నిష్పాక్షికంగా వ్యవహరించాలి.

డిజిటల్ యుగం మరో కొత్త సవాలును ముందుంచుతోంది. కృత్రిమ మేధస్సు, ముఖ గుర్తింపు వ్యవస్థలు, డిజిటల్ పర్యవేక్షణ, భారీ సమాచార సేకరణతో వ్యక్తిగత గోప్యతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. సాంకేతికత ప్రజల జీవితాలను మెరుగుపరిచే సాధనంగా ఉండాలి తప్ప వారి స్వేచ్ఛను హరించే ఆయుధంగా మారకూడదు. వ్యక్తిగత సమాచార సేకరణ, వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా బలమైన చట్టపరమైన రక్షణ అవసరం.

హక్కుల పరిరక్షణ ప్రభుత్వాలకే పరిమితమైన బాధ్యత కాదు. ప్రతి పౌరుడికీ ఇందులో పాత్ర ఉంది. మనకు కావాల్సిన గౌరవాన్ని ఎదుటివారికీ ఇవ్వాలి. కులం, మతం, భాష, లింగం, ఆర్థిక స్థితి ఆధారంగా వివక్షకు తావివ్వకూడదు. సహనం, సమానత్వం, పరస్పర గౌరవం సమాజంలో బలపడితేనే చట్టాలు కల్పించే రక్షణకు సార్థకత చేకూరుతుంది.

దేశాల సంపద, సైనిక శక్తి, సాంకేతిక పురోగతి మాత్రమే అభివృద్ధికి కొలమానాలు కావు. అత్యంత బలహీనుడి హక్కును ఎంత బలంగా కాపాడుతున్నామన్నదే అసలైన ప్రమాణం. మనిషిని విస్మరించిన అభివృద్ధికి విలువ లేదు.. మానవ గౌరవాన్ని కాపాడలేని నాగరికతకు గొప్పతనం లేదు. హక్కుల రక్షణను రాజకీయ ప్రయోజనాలకు అతీతమైన ఉమ్మడి కర్తవ్యంగా ప్రపంచ దేశాలు స్వీకరించినప్పుడే శాంతి, సమానత్వం, న్యాయం పునాదులపై నిజమైన ప్రపంచ సమాజం ఆవిష్కృతమవుతుంది.

– నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్

# దామోదరా.. 'కమీషన్' స్కాన్ చేయండి!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారానికి ఉపయోగించుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నా యి. ఆసుపత్రులు, క్లినిక్‌ల నుంచి ఎక్కువ మంది రోగులను తమ వద్దకు రప్పించేందుకు ప్రత్యేకంగా పీఆర్వోలను రంగంలో కి దింపుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రిఫర్ చేసిన రోగి పరీక్ష చేయించుకుంటే కొందరు వైద్యులకు కమీషన్ అందుతోందని, పరీక్ష ఖరీదు పెరిగే కొద్దీ ఆ 'కట్' కూడా పెరుగుతోందనే ఆరోపణలున్నాయి. వీటిలో నిజానిజాలేమిటో వైద్యారోగ్య శాఖ నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

**సీటీకి ఒకటి.. ఎంఆర్ఐకి మరొకటా?**

రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్, సీటీ, ఎంఆర్ఐ.. ఇలా పరీక్షను బట్టి రిఫరల్ కమీషన్ మారుతోందనే విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. నిజంగా కమీషన్లు చేతులు మారుతున్నట్లయితే ఆ సొమ్ము ఎక్కడి నుంచి వస్తోంది? డయాగ్నోస్టిక్ కేంద్రం తన లాభాల్లోంచి ఇస్తోందా? లేక రోగి నుంచి వసూలు చేసే ఫీజులోనే దాన్నీ కలిపేస్తోందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**"కమీషన్ ఇచ్చేంత మార్జిన్ ఉంటే.. ఆ మొత్తాన్ని మా బిల్లులోనే తగ్గించండి" అన్నది రోగుల నుంచి వినిపిస్తున్న ప్రధాన డిమాండ్.**

**ఒకే టెస్టు.. ఇన్ని రేట్లెందుకు?**

ఒకే పరీక్షకు ఒక్కో కేంద్రంలో ఒక్కో ధర ఉండటంపైనా రోగులు ప్రశ్నిస్తున్నారు. పరీక్ష చేయించుకునే ముందు ఎంత చెల్లించాలో స్పష్టంగా తెలిసే వ్యవస్థ ఉండాలని కోరుతున్నారు. అనారోగ్యంతో ఆందోళనలో ఉన్న సమయంలో కేంద్రాల చుట్టూ తిరిగి ధరలు తెలుసుకునే పరిస్థితి రోగికి ఉండదని.. దీంతో చెప్పినంత చెల్లించక తప్పడం లేదని వాపోతున్నారు. వైద్యుడి ఫీజు.. మందుల ఖర్చు.. ఆపై పరీక్షల బిల్లు.. ఇలా చికిత్స ప్రారంభమయ్యేలోపే వేల రూపాయలు ఖర్చవుతున్నాయని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**దామోదరా.. 'రేట్ల బోర్డు' పెట్టించండి!**

ప్రతి డయాగ్నోస్టిక్, స్కానింగ్ కేంద్రంలో నిర్వహించే పరీక్షల ధరలను పెద్ద అక్షరాలతో రోగులకు కనిపించేలా ప్రదర్శించేలా వైద్యారోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రక్త పరీక్ష నుంచి ఎంఆర్ఐ వరకు ఒక్కో పరీక్షకు ఎంత ఫీజు తీసుకుంటున్నారో స్పష్టంగా బోర్డుపై ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి చెల్లింపునకు కంప్యూటరైజ్డ్ బిల్లు తప్పనిసరి చేయడం, ప్రకటించిన ధరకు మించి వసూలు చేస్తే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడం, ఫిర్యాదు అందిన వెంటనే తనిఖీ చేసే వ్యవస్థ తీసుకురావాలని కోరుతున్నారు.

**వారానికో తనిఖీ.. వీటిపైనా జరగాలి!**

ప్రభుత్వ ఆసుపత్రులను వారానికోసారి ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఇటీవల అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ.. అదే తరహాలో ప్రైవేటు డయాగ్నోస్టిక్, స్కానింగ్ కేంద్రాలపైనా ప్రత్యేక తనిఖీలకు ఆదేశించాలని బాధితులు కోరుతున్నారు. అనుమతులు ఉన్నాయా? అర్హులైన సిబ్బందే పరీక్షలు నిర్వహిస్తున్నారా? పరికరాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? ధరల పట్టిక ఉందా? బిల్లులు ఇస్తున్నారా? అన్న అంశాలతో పాటు పీఆర్వోల పాత్ర, రిఫరల్ కమీషన్ల ఆరోపణలపైనా ఆరా తీయాలని డిమాండ్ చేస్తున్నారు.

**మంత్రి కన్నేస్తే.. 'కట్' కథ తేలదా?**

అనవసర రిఫరల్స్‌పై కఠినంగా స్పందిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ.. డయాగ్నోస్టిక్ రంగంలో రిఫరల్ కమీషన్ల ఆరోపణలపైనా అదే స్థాయిలో స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టి 'రిఫరల్--కమీషన్' వ్యవస్థ ఉందా? ఉంటే దాని వెనుక ఎవరున్నారు? రోగులపై ఎంత అదనపు భారం పడుతోంది? అన్నది తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు నిర్ధారణైతే సంబంధిత కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రోగులకు అందుబాటులో ఉండేలా పరీక్షల ధరల్లో పారదర్శకత తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**'అనవసర రిఫరల్స్‌కు కత్తెర వేస్తామన్న మంత్రి.. డయాగ్నోస్టిక్ కమీషన్లకూ చెక్ పెడతారా?'**

# ఒక్క ఓటూ గల్లంతు కావొద్దు!

(మొదటిపేజీ తరువాయి)

మారినవారిగా పేర్కొనడంపై ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల్లో లోపాలున్నాయని, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం లేదని తెలిపారు. దీంతో ఏకంగా 92.86 లక్షల మందికి నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఉందని.. ఇది రాష్ట్ర ఓటర్లలో దాదాపు మూడో వంతుపై ప్రభావం చూపే అంశమని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు.

**ఇంట్లో లేకుంటే ఓటు తీసేస్తారా?**

గణన సిబ్బంది వచ్చినప్పుడు తాత్కాలికంగా ఇంట్లో లేనివారిని, శాశ్వతంగా నివాసం మారినవారిని ఒకే గాటన కట్టడం సరికాదని సీఎం పేర్కొన్నారు. కొత్త ప్రాంతంలో ఫారం-6 ద్వారా నమోదు చేసుకునేందుకు సహకరించకుండానే పాత చిరునామాలో ఓటు తొలగిస్తే అర్హులు ఓటుహక్కు కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. పేరు తొలగించే ముందు నోటీసు ప్రక్రియ తప్పనిసరిగా పాటించాలని కోరారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే మొత్తం ఏ ఎస్ డి డి ఓటర్లలో 58.6శాతం ఉన్నట్లు సీఎం తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**ఊరూరా జాబితా చదవాలి**

అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును సెప్టెంబరు 16 నుంచి మరో నాలుగు వారాలు పొడిగించాలని సీఎం కోరారు. గ్రామాలు, వార్డుల్లో కనీసం రెండుసార్లు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని సూచించారు. నోటీసులు అందుకున్న కూలీలు, వలస కార్మికులు, వృద్ధులకు పత్రాల సమర్పణకు మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అర్హుడి ఓటు పోకూడదు.. అనర్హుడి పేరు చేరకూడదు అన్న లక్ష్యంతో ఎస్ఐఆర్‌ను పారదర్శకంగా చేపట్టాలని, ఇందుకు అవసరమైన పూర్తి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఉద్యమకారుల రుణం తీర్చుకోవాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

కల్పించాల్సిన సంక్షేమ పథకాలపై సీఎంతో చర్చించారు.

**13 వేల మందితో సంప్రదింపులు**

హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం వద్ద ఇటీవల నిర్వహించిన విస్తృత సంప్రదింపుల వివరాలను కమిటీ సీఎంకు వివరించింది. 13 వేల మందికిపైగా ఉద్యమకారులతోపాటు వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారుల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపింది. వారి నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సూచనల ఆధారంగా రూపొందించిన ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా నివేదికను ముఖ్యమంత్రికి అందించింది.

గుర్తింపునకు ప్రత్యేక పోర్టల్

ఉద్యమకారుల గుర్తింపునకు పారదర్శక విధానం రూపొందించాలని సీఎం సూచించారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడంతోపాటు జిల్లాలవారీగా వాటి పరిశీలనకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కమిటీకి అవసరమైన పరిపాలనా సహకారం, వనరులను సమకూర్చాలని స్పష్టం చేశారు.

**250 గజాల స్థలం.. పింఛన్‌పైనా చర్చ**

ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలం, ఫింఛన్, ఆరోగ్య కార్డులు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఉద్యోగులుగా ఉన్న ఉద్యమకారులకు ప్రత్యేక గౌరవ గుర్తింపు తదితర డిమాండ్లను కమిటీ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. వీటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు కమిటీ వెల్లడించింది. తెలంగాణ సాధన కోసం జీవితాలను పణంగా పెట్టి పోరాడిన వారిని గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీఎం పేర్కొన్నారు. గుర్తింపు ప్రక్రియను వీలైనంత త్వరగా కొలిక్కి తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, వి.పి.గౌతమ్, ఎస్.శ్రీధర్, సీఎం ఓఎస్డీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'బిడ్డా.. వారం రోజులే గడువు!'

(మొదటిపేజీ తరువాయి)

తీయించుకోవడానికి వారినే కార్యాలయాల చుట్టూ తిప్పడం ఏమిటి?" అని ప్రశ్నించారు.

**'98 శాతం అయితే.. ఇవెందుకు?'**

22ఏ సమస్యలను 98 శాతం పరిష్కరించామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెబుతున్నారని హరీశ్‌రావు గుర్తుచేశారు. "98 శాతం పరిష్కారమైతే ఒక్క పటాన్‌చెరు నియోజకవర్గంలోనే 50,565 ఎకరాలు ఇంకా నిషేధిత జాబితాలో ఎందుకున్నాయి? ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా "పొంగులేటి కాదు.. పొంగులూటీ" అంటూ విమర్శించారు.

**'పెద్దలకో న్యాయం.. ప్రజలకో న్యాయమా?'**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంబంధించిన ఇంటిని దరఖాస్తు లేకుండానే నిషేధిత జాబితా నుంచి తొలగించారని హరీశ్‌రావు ఆరోపించారు. పాలకులకు సంబంధించిన ఆస్తులపై వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ.. సామాన్యులను మాత్రం దరఖాస్తులతో కార్యాలయాల చుట్టూ తిప్పడం ఏమిటని ప్రశ్నించారు. "మీ ఆస్తులను ఎలా బయటకు తీశారో.. ప్రజల ఇళ్లు, భూములనూ అలాగే 22ఏ నుంచి తొలగించాలి" అని డిమాండ్ చేశారు.

**వారం తర్వాత.. కలెక్టరేట్‌కు దండు**

22ఏలో చిక్కుకున్న భూముల వివరాలను పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి జిల్లా అధికారులకు అందజేస్తారని హరీశ్‌రావు తెలిపారు. వాటిని పరిశీలించి వివాదరహిత ఆస్తులను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. "వారం రోజుల గడువు ఇస్తున్నాం. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే బాధిత రైతులు, కుటుంబాలతో సంగారెడ్డికి వస్తాం. కలెక్టరేట్‌ను ముట్టడించి తీరుతాం" అని హెచ్చరించారు.

# వేపచెట్టు కోసం రక్తపాతం!

**సూర్యాపేట, ఆగస్టు 29 (మన విశ్వం):** ఓ వేపచెట్టు వివాదం.. రెండు కుటుంబాల మధ్య చిచ్చు రేపింది. మాటామాటా పెరిగింది.. ఆవేశం కట్టలు తెంచుకుంది.. చేతుల్లోకి గొడ్డళ్లు వచ్చాయి. పరస్పర దాడులతో ఎర్రగడ్డ తండా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘర్షణలో వెంకటేశ్వర్లు యాదవ్ ఘటనా స్థలంలోనే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన సైదా ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు విడిచారు. ఘర్షణను అదుపు చేసేందుకు వెళ్లిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌పైనా దాడి జరగడంతో ఆయన తలకు గాయమైంది. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

**మాటామాటా.. గొడ్డళ్ల దాకా!**

స్థానికుల సమాచారం ప్రకారం.. ఇంటి పక్కనున్న వేపచెట్టు యాజమాన్యం, దాన్ని తొలగించే విషయమై రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. శనివారం ఇదే అంశంపై మరోసారి వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో పరిస్థితి ఒక్కసారిగా అదుపుతప్పింది. ఇరువర్గాల వారు గొడ్డళ్లతో పరస్పరం దాడులకు దిగినట్లు తెలుస్తోంది. దాడిలో వెంకటేశ్వర్లు యాదవ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సైదా తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మార్గమధ్యలోనే ఆయన మృతిచెందారు. క్షణాల వ్యవధిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**అడ్డుకోబోయిన 'ఎస్ఐ'పైనా దాడి**

ఘర్షణ సమాచారం అందుకున్న మేళ్లచెరువు పోలీసులు హుటాహుటిన తండాకు చేరుకున్నారు. ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఎస్ఐ నవీన్‌పైనా దాడి జరిగినట్లు సమాచారం.



గొడ్డలి దాడిలో ఆయన తలకు గాయం కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఇద్దరి మృతితో ఇరువర్గాల మధ్య మరింత ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా తండాలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఘర్షణలో పాల్గొన్న వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

# మూగజీవాల ఆసుపత్రికి 'నిర్లక్ష్య' రోగం!

(మొదటిపేజీ తరువాయి)

దోమలు, ఈగలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటున్నారు.

**భవనం పరిస్థితీ అంతంతే..**

పశువైద్యశాల భవనంలోని తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. మండలంలోని గ్రామాలకు అవసరమైన పశువుల మందులు ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్న నేపథ్యంలో వాటి భద్రతపైనా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన పశువైద్య కేంద్రం నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

**పట్టించుకునేదెప్పుడు?**

పశుపోషణపై ఆధారపడి జీవించే రైతులకు కీలకమైన ఈ వైద్యశాల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఆసుపత్రికి వెళ్లే రహదారిని మెరుగుపరచడంతోపాటు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని, భవనానికి అవసరమైన మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# గడల.. నెట్టుకురాగలడా?

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావును బరిలోకి దింపింది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి ప్రధాన పార్టీల అభ్యర్థులపై ఇంకా స్పష్టత రాకముందే జనసేన తన అభ్యర్థిని ప్రకటించి ఎన్నికల రేసులో ముందడుగు వేసింది. దీంతో ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఒకటే చర్చ..'గడల.. నెట్టుకురాగలడా?' తెలంగాణలో శాసనమండలి స్థానానికి జనసేన అభ్యర్థిని నిలబెట్టడం ఇదే తొలిసారి. గతంలో వైద్య ఆరోగ్యశాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన గడలకు ప్రభుత్వ వ్యవస్థపై అవగాహనతోపాటు వైద్య, ఉద్యోగ వర్గాల్లో పరిచయాలు ఉన్నాయి. ప్రస్తుతం జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యాన్నే రాజకీయ బలంగా మార్చుకుని పట్టభద్రులను ఆకట్టుకోవాలన్నది జనసేన వ్యూహంగా కనిపిస్తోంది.

**ముందస్తు ప్రకటనే తొలి ఎత్తు**

ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే అభ్యర్థిని ప్రకటించడం ద్వారా జనసేన వ్యూహాత్మకంగా అడుగు వేసింది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికలో ఉండగానే గడలకు ప్రచారానికి ఎక్కువ సమయం దక్కనుంది. మూడు ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల వద్దకు వెళ్లడం, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతతో సమావేశాలు నిర్వహించడం, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవడానికి ఈ ముందస్తు ప్రకటన ఉపయోగపడుతుందని జనసేన భావిస్తోంది. సెప్టెంబరు 13న ఖమ్మంలో ' జనసేన – శంఖారావం ' పేరుతో భారీ సమావేశానికి పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికనే తెలంగాణలో పార్టీ విస్తరణకు తొలి మెట్టుగా మార్చుకోవాలన్న లక్ష్యంతో జనసేన ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

**పవన్ క్రేజ్.. ఓట్లుగా మారుతుందా?**

జనసేనకు ప్రధాన బలం ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్. యువతలో ఆయనకు ఉన్న ఆదరణను పట్టభద్రుల ఓట్లుగా మలుచుకోవడమే పార్టీ ముందున్న కీలక సవాల్. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తీరు భిన్నం. పార్టీ అభిమానంతోపాటు అభ్యర్థి వ్యక్తిగత సామర్థ్యం, విద్యావంతులతో సంబంధాలు, ఉద్యోగ--నిరుద్యోగ సమస్యలపై వైఖరి కీలకంగా మారతాయి. అందువల్ల పవన్ ప్రభావానికి గడల వ్యక్తిగత పరిచయాలు తోడైతేనే జనసేనకు బలమైన పోటీ ఇచ్చే అవకాశం ఏర్పడుతుంది.

**గడలకు అసలు పరీక్ష ఇదే!**

ఉన్నతాధికారిగా గడల శ్రీనివాసరావుకు గుర్తింపు ఉన్నప్పటికీ దాన్ని ఓట్లుగా మార్చుకోవడం అంత సులభం కాదు. ఖమ్మం నుంచి వరంగల్, నల్గొండ వరకు విస్తరించిన నియోజకవర్గంలో బలమైన క్షేత్రస్థాయి నెట్‌వర్క్ అవసరం. ప్రధాన పార్టీలకు ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సంస్థాగత బలం ఉంది. జనసేన మాత్రం మూడు జిల్లాల్లోనూ తన శ్రేణులను ఎన్నికల యంత్రాంగంగా మార్చుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువతను తనవైపు తిప్పుకోవడానికి గడల ఏ అజెండాతో ముందుకెళ్తారన్నది కీలకం. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగం, విద్య, ఉద్యోగుల సమస్యలు వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణతో ఓటర్లలోకి వెళ్లగలిగితే ఆయనకు అనుకూల వాతావరణం ఏర్పడే అవకాశముంది.

**పట్టభద్రులు 'గ్లాస్' వైపు చూస్తారా?**

ప్రస్తుతం ఈ స్థానానికి కాంగ్రెస్‌కు చెందిన తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఎవరిని బరిలోకి దింపుతాయన్నదానిపై పోటీ స్వరూపం ఆధారపడి ఉంటుంది. బలమైన అభ్యర్థులు రంగంలోకి దిగితే జనసేనకు పోరు మరింత కఠినం కానుంది. అయితే అందరికంటే ముందే అభ్యర్థిని ప్రకటించడం గడలకు లభించిన ప్రధాన అడ్వాంటేజ్. ఈ సమయాన్ని ఆయన ఎంత సమర్థంగా ఉపయోగించుకుంటారు? మూడు జిల్లాల్లో పట్టభద్రుల మధ్య తనకంటూ ఓటుబ్యాంకును నిర్మించుకోగలరా? పవన్ కల్యాణ్ ఆదరణను ఓట్లుగా మలచగలరా? ప్రధాన పార్టీల రాజకీయ యంత్రాంగాన్ని ఎదుర్కొని జనసేన 'గ్లాస్'ను మండలికి చేర్చగలరా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేది చివరకు పట్టభద్రులే. కానీ ప్రధాన పార్టీల కంటే ముందే అభ్యర్థిని ప్రకటించి జనసేన విసిరిన తొలి పాచిక మాత్రం ఖమ్మం -నల్గొండ -వరంగల్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరతీసింది.

# తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

సంతరించుకుంది. చిత్తూరు జిల్లాకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలం కీలక పాత్ర పోషించారు. ఎమ్మెల్యేగా, ప్రభుత్వ చీఫ్‌విప్‌గా, శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన సమయంలో ముఖ్యమంత్రిగా ఉండటంతో అప్పటి రాజకీయ పరిణామాల్లో ఆయన పేరు ప్రముఖంగా నిలిచింది. కాంగ్రెస్‌తో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కిరణ్‌కుమార్‌రెడ్డి.. రాష్ట్ర విభజన అనంతరం సొంత పార్టీని ఏర్పాటు చేశారు. తర్వాత తిరిగి కాంగ్రెస్‌లో చేరిన ఆయన అనంతరం భాజపాలో చేరారు. తాజాగా తమిళనాడు గవర్నర్‌గా నియమితులవడంతో మరోసారి ఆయన పేరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాజకీయాలతోపాటు శాసన, పరిపాలనా వ్యవహారాల్లో ఆయనకున్న అనుభవం గవర్నర్‌గా బాధ్యతల నిర్వహణలో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే ఆయన తమిళనాడు గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి నియామకంపై పలువురు నేతలు అభినందనలు తెలిపారు.

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక
ఆదివారం ,
ఆగస్టు 30, 2026



# రామతీర్థంలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం




**నల్లబెల్లి, ఆగస్టు 29(మన విశ్వం):** నల్లబెల్లి మండలంలోని రామతీర్థం గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు గ్రామ ప్రజలతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, సోదరభావం, పౌర హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.
పౌరులందరూ తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని అధికారులు సూచించారు. సమాజంలో వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వ భావనతో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాయి ప్రసన్న కుమార్, ఎంపీఓ, ఎంఈఓ అనురాధ, ఎమ్మార్వో ముప్పు కృష్ణ, గ్రామ సర్పంచ్ పోదెల వసంత శోభన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏపీఎం, మెడికల్ ఆఫీసర్ డా. ఆచార్య, వీఆర్ఎస్, ఏపీఓ, రెవెన్యూ గిర్ధవర్, జీపీఓ, పంచాయతీ సెక్యూరిటీ రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కోట్నాక భీమ్‌రావు సేవలు చిరస్మరణీయం మాజీ మంత్రి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**- ఎమ్మెల్సీ దండే విఠల్‌తో పాటు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ హాజరు**

**కొమురం భీం, ఆగస్టు 29(మన విశ్వం):** మాజీ మంత్రి స్వర్గీయ కోట్నాక భీమ్‌రావు ప్రజాసేవకు అంకితమైన నాయకుడని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. భీమ్‌రావు వర్ధంతి సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్కులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా దండే విఠల్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, ప్రాంత అభివృద్ధికి భీమ్‌రావు విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ తదితరులు భీమ్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మర్తిడిలో పోలీసుల కార్డన్ సెర్చ్

**- గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసుపానకం, బెల్లం నీరు ధ్వంసం**



**కొమురం భీం , ఆగస్టు 29 (మన విశ్వం):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామంలో శనివారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం విక్రయాల కట్టడిలో భాగంగా ఎస్సై సర్తాజ్ పాషా ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలోని పలు ఇళ్లు, అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.
తనిఖీల్లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన పానకం, బెల్లం నీటిని గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు.
గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయం, రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్సై సర్తాజ్ పాషా హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ మద్యం, ఇతర నిషేధిత కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# గురుకులంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**- సీసీ కెమెరాలు, హాజరు, బోధన తీరుపై ఆరా**
**- నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశం**

**ములుగు ప్రతినిధి , ఆగస్టు 29 (మన విశ్వం):** ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాలలోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించడంతోపాటు విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. జూనియర్ కళాశాల విద్యార్థినులకు జరుగుతున్న యూనిట్ పరీక్షల నిర్వహణను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.
విద్యార్థినులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం మెనూ ప్రకారం వడ్డించాల్సిన ఆహార పదార్థాల వివరాలను పరిశీలించారు. వంట తయారీలో నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థినుల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తనిఖీలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, రికార్డు అసిస్టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



**- పలు వార్డుల్లో మురికికాలువల శుభ్రతసర్పంచ్ దుర్గం సరోజ--తిరుపతి పర్యవేక్షణ**

**బెజ్జూరు, ఆగస్టు 29 (మన విశ్వం):** గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బెజ్జూరు గ్రామపంచాయతీ సర్పంచ్ దుర్గం సరోజ--తిరుపతి సూచించారు. శనివారం గ్రామంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. పంచాయతీ కార్మికులతో మురికికాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించారు.
వర్షాకాలంలో మురికినీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడిక, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. అపరిశుభ్రత కారణంగా దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ సిబ్బందితో పాటు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తామని సర్పంచ్ తెలిపారు.

# భద్రాచలంలో పుష్కర ఘాట్ల నిర్మాణం ప్రారంభం

**- రూ.49 కోట్లతో మూడు దశల్లో పనులు**
**- భూమిపూజలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే**
**- 2027 గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు**
**- భక్తులకు మెరుగైన వసతులే లక్ష్యం**



**భద్రాచలం, ఆగస్టు 29 (మన విశ్వం):** వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలు--2027ను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలో పుష్కర ఘాట్ల నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. గోదావరి పరివాహక ప్రాంతంలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పుష్కర ఘాట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు--2027 కోసం మొత్తం రూ.49 కోట్ల వ్యయంతో మూడు విడతల్లో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తొలి విడతలో రూ.46.65 కోట్లు, రెండో విడతలో రూ.1.75 కోట్లు, మూడో విడతలో రూ.60 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు.
మొదటి దశలో భద్రాచలం పట్టణంలోని ప్రధాన ఘాట్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, బూర్గంపాడు మండలంలోని మోతెపట్టినగర్ ప్రాంతాల్లో పుష్కర ఘాట్ల నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. తదుపరి దశల్లో ములుగు జిల్లాలోని చిన్నరావిగూడెం, రామానుజావరం, రామచంద్రాపురం ప్రాంతాల్లో కూడా పనులు చేపట్టి పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశమున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్నానాల ఘాట్లు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, విశ్రాంతి కేంద్రాలు వంటి మౌలిక వసతులను సమకూర్చాలని అధికారులకు సూచించారు. అలాగే భద్రాచలం కరకట్ట ప్రాంతంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. పుష్కరాల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భక్తుల రాకపోకలు, భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఈఓ దామోదర్ రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజినీర్ మహేశ్వరరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. గోదావరి పుష్కరాలు--2027ను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని స్థాయిల్లో సమగ్ర ఏర్పాట్లు చేపడుతోందని అధికారులు తెలిపారు.

# విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

**- ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్**
**- కంటి ఆరోగ్యంపై విద్యార్థుల్లో అవగాహన**
**- పాఠశాలల్లో ఆరోగ్య సేవలకు ప్రాధాన్యం**
**- విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**




**ఆదిలాబాద్, ఆగస్టు 29 (మన విశ్వం):** స్థానిక భుక్తాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆరోగ్య పాఠశాల కార్యక్రమంతో పాటు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా విద్యార్థులు ఆరోగ్య పాఠశాల అంశాలపై వివిధ ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, కంటి సంరక్షణ, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి వంటి అంశాలపై విద్యార్థులు వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. ఆరోగ్యంపై చిన్న వయస్సు నుంచే అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పాఠశాల స్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, వైద్య సేవలు అందించడం ద్వారా విద్యార్థుల విద్యాభ్యాసం మరింత మెరుగుపడుతుందని చెప్పారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యారోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ పాఠశాలల్లో నిరంతరం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కంటి చూపు సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించడం జరుగుతోందన్నారు. దీంతో విద్యార్థుల చదువులో ఏ విధమైన ఆటంకాలు తలెత్తకుండా చూడగలుగుతున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వం వంటి అంశాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు ఆరోగ్యం కూడా సమానంగా అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాధన, స్థానిక కౌన్సిలర్ ప్రకాష్, వైద్యులు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రమేష్ రెడ్డి, డీబీసీఓ కృష్ణ, ఆర్బీఎస్కే వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంతో పాటు కంటి సంరక్షణ ప్రాముఖ్యతను మరింతగా తెలియజేసింది.

# ప్రజల వద్దకే ప్రజా పాలన

**- ఐదు గ్రామాల్లో 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమం**
**- అధికారుల సమక్షంలో ప్రజల సమస్యలు విన్న మంత్రి పొన్నం ప్రభాకర్**






**ఎల్కతుర్తి, ఆగస్టు 29 (మన విశ్వం) :** ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజల వద్దకే వెళ్లి అధికారుల సమక్షంలో వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ శాసనసభ్యుడు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు ఎల్కతుర్తి మండలంలోని సూరారం, దండేపల్లి, వీరనారాయణపురం, వల్లభాపూర్, ఇంద్రనగర్ గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. గ్రామ పంచాయతీ భవనాలు, అంతర్గత సీసీ రోడ్లు, ప్రధాన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సమస్యలను ప్రజలు నేరుగా అధికారులకు విన్నవిస్తున్నారు. ప్రజలు సమర్పించిన వినతులను స్వీకరించిన మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా, ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# శాకాహారులకు ప్రోటీన్లను అందించే అత్యుత్తమ ఆహారం ఇది.. రోజూ తీసుకుంటే ఎంతో మేలు..

శాకాహారులు, వీగన్లు రోజువారీ ఆహారంలో తగినంత ప్రోటీన్ పొందేందుకు ఎన్నో మొక్కల ఆధారిత ఆహారాలను ఎంచుకుంటారు. అయితే ప్రోటీన్‌తోపాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు వంటి పలు పోషకాలను ఒకేసారి అందించే చిన్న విత్తనం ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టిని ఆకర్షిస్తోంది. అదే హెంప్ హార్ట్స్. పొట్టు తొలగించిన హెంప్ విత్తనాలు తినడానికి సులభంగా ఉండటంతోపాటు, తక్కువ పరిమాణంలోనే పలు ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. హెంప్ హార్ట్స్‌లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. సుమారు రెండు టేబుల్ స్పూన్ల హెంప్ హార్ట్స్‌లో 8.4 గ్రాముల వరకు మొక్కల ఆధారిత ప్రోటీన్ లభిస్తుంది. అలాగే శరీరానికి అవసరమైన మొత్తం తొమ్మిది ఎసెన్షియల్ అమైనో యాసిడ్లు ఇందులో ఉంటాయి. అందువల్ల వీటిని కంప్లీట్ ప్రోటీన్ అందించే ఆహార వనరుగా తీసుకోవచ్చు. ముఖ్యంగా శాకాహారులు, వీగన్లకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. అమైనో యాసిడ్లు అధికం.. హెంప్ హార్ట్స్‌లో అర్జినైన్ అనే అమైనో యాసిడ్ కూడా సహజంగా సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలు సడలించడంలో, రక్తప్రసరణ సక్రమంగా ఉండటంలో, సాధారణ రక్తపోటు నియంత్రణకు తోడ్పడటంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.
వీటిలో ప్రోటీన్ మాత్రమే కాకుండా మెగ్నీషియం, ఒమెగా-3 వంటి పోషకాలు కూడా లభిస్తాయి. సుమారు 25 గ్రాములు లేదా రెండు టేబుల్ స్పూన్ల హెంప్ హార్ట్స్‌లో దాదాపు 175 మిల్లీగ్రాముల మెగ్నీషియం, 2.5 గ్రాముల ఏఎల్ఏ ఒమెగా-3 లభిస్తుంది. ఇందులో ఏఎల్ఏ, ఎల్ఏ, జీఎల్ఏ వంటి కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. హెంప్ హార్ట్స్‌లో ఒమెగా-6 నుంచి ఒమెగా-3 నిష్పత్తి సుమారు 2.5:1 నుంచి 3:1 వరకు ఉంటాయి. హెంప్ హార్ట్స్‌లోని పోషకాల కలయిక వాటిని చిన్న పరిమాణంలోనే ఎక్కువ పోషకాలను అందించే ఆహారంగా మారుస్తుంది. ప్రోటీన్, మెగ్నీషియం, ఏఎల్ఏ, జీఎల్ఏ, అర్జినైన్ వంటి పోషకాలు ఇందులో ఉండటం వల్ల రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవచ్చు. శరీరంలోని వాపులు తగ్గేందుకు.. హెంప్ హార్ట్స్‌లోని కొవ్వు ఆమ్లాలు శరీరంలోని వాపు సంబంధిత ప్రక్రియలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.



ముఖ్యంగా జీఎల్ఏ వాపును నియంత్రించే మార్గాల్లో భాగస్వామ్యం అవుతుందని, వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మం, గుండె ఆరోగ్యానికి కూడా తోడ్పడతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. హెంప్ విత్తనాలకు భారతీయ సంస్కృతి, పురాణాలతో కూడా ఒక ఆసక్తికరమైన సంబంధం ఉంది. సముద్ర మథనం సమయంలో ఉద్భవించిన హాలాహల విషాన్ని లోకరక్షణ కోసం పరమశివుడు స్వీకరించి తన కంఠంలో నిలుపుకున్న కథ తెలిసిందే. ఈ కారణంగానే శివుడిని నీలకంఠుడిగా పిలుస్తారు. హెంప్ మొక్కకు సంబంధించిన విత్తనాలపై కూడా ఈ పురాణగాథతో ముడిపడిన సాంస్కృతిక ప్రస్తావనలు ఉన్నాయి. పెద్ద మొత్తంలో అవసరం లేదు..
రోజువారీ ఆహారంలో హెంప్ హార్ట్స్‌ను పెద్ద మొత్తంలో తీసుకోవాల్సిన అవసరం లేదు. మొదట ఒక టేబుల్ స్పూన్ అంటే సుమారు 12 నుంచి 13 గ్రాములతో ప్రారంభించాలి. వీటిని పెరుగు, ఓట్స్, స్మూతీలు, సలాడ్లు వంటి ఆహారాల్లో కలుపుకోవచ్చు. అలాగే పప్పు, చిల్లా పిండిలో లేదా గోధుమ పిండిలో కూడా హెంప్ హార్ట్స్‌ను కలిపి తీసుకోవచ్చు. ఇలా సాధారణంగా తీసుకునే ఆహారాల్లోనే వీటిని చేర్చుకోవడం ద్వారా అదనంగా మొక్కల ఆధారిత ప్రోటీన్‌తో పాటు మెగ్నీషియం, ఒమెగా-3 తదితర పోషకాలను ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే ఏదైనా కొత్త ఆహారాన్ని రోజువారీ డైట్‌లో చేర్చుకునే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, ఆహార అలవాట్లను పరిగణనలోకి తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# 'ఉగ్రవాద రహిత ప్రాంతం దిశగా భారత్ లక్ష్యం'

ఉగ్రవాద రహిత ప్రాంతం కోసం భారతదేశ దార్శనికతను ముందుకు తీసుకెళ్లే దిశగా తాను ఎదురుచూస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎస్?సీఓ శిఖరాగ్ర సమావేశ ంలో పాల్గొనేందుకు ఆయన శనివారం ఉజ్బెకిని ్థాన్, కిర్గిస్థాన్ పర్యటనకు బయల్దేరారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లో ఆయన పర్యటించనున్నారు. ఉజ్బెక్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో తాష్కెంట్‌లో మోదీ అధికారిక పర్యటన కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచే అంశాలపై మిర్జియోయెవ్‌తో మోదీ చర్చలు జరపనున్నారు. ఈ మేరకు మోదీ ఓ ప్రకటనను విడుదల చేశారు.గాంధీ కేంద్రం, శాస్త్రి మెమోరియల్ సందర్శభారత వస్తృత పొరుగు దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేయడం, మధ్య ఆసియా ప్రాంతంలో సహకారాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల విదేశీ పర్యటనకు బయల్దేరారు. తొలుత ఉజ్బెక్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్ పర్యటనలో భాగంగా ఆయన లాల్‌బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శి ంచనున్నారని తెలిపారు. అలాగే తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని



మహాత్మాగాంధీ కేంద్రాన్ని కూడా సందర్శిస్తారని వెల్లడించారు. భారత్– ఉజ్బెకిస్థాన్ మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలకు ఈ ప్రదేశాలు ప్రతీకలుగా నిలుస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్', 'యాంగీ ఉజ్బెకిస్థాన్' లక్ష్యాలకు అనుగుణంగా ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తోందని అన్నారు.ఎస్‌సీఓ సదస్సుకు హాజరుఉజ్బెకిస్థాన్ పర్యటన అనంతరం మోదీ కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారని ప్రకటనలో ప్రేర్కొన్నారు. కిర్గిస్థాన్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు అక్కడ జరిగే 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారని తెలిపారు. తన పర్యటన మధ్య ఆసియాలో భారతదేశ వ్యూహాత్మక భాగస్వామ్యాలను బలోపేతం చేస్తుందని, ఈ ప్రాంతంతో నాగరిక సంబంధాలను మరింతగా పెంచుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తన వీడ్కోలు ప్రకటనలో మోదీ, ఈ పర్యటన శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు అనే ఉమ్మడి సాధనను ముందుకు తీసుకెళుతుందని, ఈ విలువలే ప్రపంచంతో భారతదేశ సంబంధాలకు మూలస్తంభాలని అన్నారు. ఉగ్రవాదంపై భారత్ వైఖరిఎస్‌సీఓ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారని, 2017 నుంచి భారత్ ఈ సంస్థలో చురుకైన, నిర్మాణాత్మక సభ్యదేశంగా కొనసాగుతోందని మోదీ అన్నారు. సదస్సు చివరి రోజు జరిగే ప్లీనరీ సమావేశంలో ప్రధాని ప్రసంగించనున్నారని తెలిపారు. ఎస్‌సీఓ వేదికగా ప్రాంతీయ భద్రత, అనుసంధానం, ఆర్థిక అవకాశాలు, శాంతి, స్థిరత్వానికి సంబంధించిన అంశాలను భారత్ ప్రస్తావించనుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉగ్రవాదం, వేర్పాటువాదం, అతివాదం వంటి సవాళ్లపై సభ్యదేశాలతో కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని మోదీ నొక్కిచెప్పనున్నారని అన్నారు. పొరుగు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వానికి నిరంతరం ముప్పుగా మారుతున్న ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సమష్టి చర్యలు అవసరమని భారత్ అభిప్రాయపడుతోందని వెల్లడించారు. పుతిన్, జిన్‌పింగ్‌తో భేటీలపై ఆసక్తిఎస్?సీఓ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మోదీ ఇతర దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ముఖ్యంగా పుతిన్‌తో జరిగే భేటీపై ఆసక్తి నెలకొంది. మధ్య ఆసియా దేశాలతో భారత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి సహకరించడమే పర్యటన ప్రధాన ఉద్దేశంగా ఉంది.

# సీఎం విజయ్ ఆకస్మిక తనిఖీ.. జైలులో ఖైదీలతో నేరుగా మాట్లాడి



**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ శుక్రవారం చెన్నై సమీపంలోని పురుషల్ సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జైలు సదుపాయాలు, ఖైదీలకు అందుతున్న వైద్యం, ఆహారం, విద్య, వృత్తి శిక్షణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను కూడా తెలుసుకున్నారు పరిశీలించారు. క్వారంటైన్ ప్రాంతం, సందర్శకుల హాల్, జైలు ఆసుపత్రి, డ్రగ్ డీ–అడిక్షన్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్, మహాత్మా గాంధీ కమ్యూనిటీ కాలేజీ తరగతి గదులు, లైబ్రరీ, అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. హై–సెక్యూరిటీ బ్లాక్, ఉరిశిక్ష అమలు చేసే ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ఖైదీలతో సీఎం విజయ్ నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు ఖైదీలకు కేవలం శిక్ష విధించడం కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ ద్వారా పునరావాసానికి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు జైలులో పుస్తకాల లభ్యతను కూడా పెంచాలని సీఎం సూచించారు. చదువు, నైపుణ్య శిక్షణ, ఖైదీల ఆసక్తులకు అనుగుణంగా వివిధ కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. పురుషల్ జైలులోని వృత్తి శిక్షణ కేంద్రాన్ని కూడా విజయ్ పరిశీలించారు.ఖైదీలు తయారు చేసిన ఇనుప ర్యాకులు, పేపర్ కవర్లు, ఆఫీస్ ఫైల్ బోర్డులతో పాటు హ్యాండ్లూమ్, టైలరింగ్ విభాగాల్లో తయారవుతున్న వస్తువులను పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం నాణ్యతను కూడా తనిఖీ చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో ప్రభుత్వ చిన్నారుల ఆసుపత్రిని, అనంతరం దళిత విద్యార్థుల ప్రభుత్వ హాస్టల్‌ను కూడా ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.

# మమతా బెనర్జీకి షాక్.



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి షాక్ తగిలింది. కోర్టు నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలివి. ఆగస్టు 28, శుక్రవారం కోల్‌కతాలో తృణమూల్ ఛాత్ర పరిషత్ (టీఎంసీపీ) ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం జరిగింది. టీఎంసీపీ అంటే టీఎంసీకి చెందిన విద్యార్థి విభాగం.ఈ కార్యక్రమం నిర్వహించుకునేందుకు కోల్‌కతా హైకోర్టు పలు సూచనలు, నిబంధనలతో అనుమతించింది. దీని ప్రకారం కోల్‌కతాలోని క్యాథెడ్రల్ రోడ్డులోని ఒకవైపు మాత్రమే కార్యక్రమం నిర్వహించుకోవాలి. కానీ, రెండోవైపు కూడా నిర్వాహకులు కార్యక్రమం నిర్వహించారు. వాహనాల రాకపోకలకు అడ్డు తగిలారు. ఇదే సమయంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా నేతలు ప్రవర్తించారు. బ్యారికెడ్లు దాటుకుంటూ, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించారు. దీంతో నిర్వాహకులపై హస్టింగ్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.ఇప్పటికే శుక్రవారం టీఎంసీ అగ్రనేత అభిషేక్ బెనర్జీపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తాజాగా టీఎంసీ అధినేత్రి మమతా బెనరీ ్జపై బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎస్ఐ అపు బైద్య ఫిర్యాదు మేరకు ఈ నమోదైనట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి మమతా బెనర్జీ హాజరయ్యారు. దీంతో ఆమెపై కేసు నమోదు చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఇతర నేతలపై కూడా కేసు నమోదైనట్లు తెలుస్తోంది.

# నేపాల్ వరదల్లో చిక్కుకున్న భారతీయులను త్వరగా స్వదేశానికి తీసుకురావాలని ఖర్గే విజ్ఞప్తి

: నేపాల్?లో భీకర వరదల కారణంగా నెలకొన్న పరిస్థితులపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరావాస చర్యలను మరింత ముమ్మరం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. ముఖ్యంగా నేపాల్‌లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి అత్యవసర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన ప్రాంతాల్లో జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను నేపాల్‌కు పంపే అంశాన్ని పరిశీలించాలని ఖర్గే లేఖలో పేర్కొన్నారు. నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రక్షణ, తరలింపు, సహాయక చర్యల్లో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని వినియోగించాలని సూచించారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో ఎన్‌డీఆర్ఎఫ్‌కు ఉన్న అనుభవం, సాంకేతిక నైపుణ్యం ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అదే సమయంలో నేపాల్ ప్రజలకు అవసరమైన మానవతా, సహాయక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీకి రాసిన లేఖలో ఖర్గే కోరారు.'భారతీయులను సురక్షితంగా తీసుకురావాలి'నేపాల్‌లో వరదల కారణంగా భారతీయులు, భారత సంతతికి చెందిన పలువురు చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. విదేశాంగ శాఖ తాజా సమాచారం ప్రకారం సుమారు 320 మంది భారతీయులు ఆచూకీ



తెలియకుండా ఉన్నారని తన లేఖలో పేర్కొన్నారు. వారిని గుర్తించి, అవసరమైన సహాయం అందించి, వీలైనంత త్వరగా సురక్షితంగా భారత్‌కు తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. వేలాది మంది ఆహారం, మందులు, నివాసం వంటి కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఖర్గే పేర్కొన్నారు. ఆగస్టు 26న రసువా జిల్లాలో సంభవించిన ఆకస్మిక వరదలు భారీ విధ్వంసం సృష్టించాయి. నేపాల్‌లో మృతుల సంఖ్య 579కు చేరగా, గల్లంతైన వారి సంఖ్య 1,924కు పెరిగింది కాగా, విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, 84 మంది భారతీయులను ఇప్పటికే రక్షించారు. వీరిలో తమిళనాడుకు చెందిన 21 మంది శుక్రవారం భారత్‌కు చేరుకున్నారు. మరో 63 మంది త్రిశూలి–1 జలవిద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులు ఉన్నారు.నేపాల్‌కు చేరిన 11 మంది భారత బృందంఇదిలా ఉండగా నేపాల్‌లో సహాయక చర్యలకు మద్దతుగా 11 మంది సభ్యులతో కూడిన భారత బృందం శనివారం నేపాల్‌కు చేరుకుంది. నేపాల్ ప్రభుత్వం చేసిన అభ్యర్థన మేరకు ఈ బృందాన్ని పంపినట్లు భారత రాయబార కార్యాలయ వర్గాలు తెలిపాయి. బృందంలో వైద్య సిబ్బందితో పాటు సొరంగాల రక్షణలో నైపుణ్యం ఉన్న నిపుణులు ఉన్నారు. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో స్థానిక అధికారులతో కలిసి వీరు రక్షణ చర్యల్లో పాల్గొననున్నారు. నేపాల్ ప్రభుత్వం తొలిదశలో తమ భద్రతా బలగాలనే గరిష్ఠంగా వినియోగించాలని భావించినప్పటికీ, ప్రత్యేక సాంకేతిక నైపుణ్యం అవసరమైన చోట అంతర్జాతీయ సాయం తీసుకోవడానికి సిద్ధమని ఇప్పటికే ప్రకటించింది. వరదల్లో మూడు డజన్లకు పైగా వంతెనలు కొట్టుకుపోవడంతో నేపాల్‌లో రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో 42 బైలీ వంతెనల నిర్మాణానికి భారత్, చైనాల సాయం కోరింది. త్వరగా ఏర్పాటు చేయడానికి వీలుగా ఉండే ఈ తాత్కాలిక వంతెనలు రవాణా మార్గాలను పునరుద్ధరించడంలో కీలకంగా మారనున్నాం ు.స్వస్థలానికి చేరుకున్న తమిళనాడు యాత్రికులునేపాల్ విపత్తు నుంచి ప్రాణాలతో బయటపడిన 21మంది తమిళనాడు యాత్రికులు సురక్షితంగా స్వస్థలానికి చేరుకున్నారు. చెన్నై విమానాశ్రయంలో కన్నీటి దృశ్యాలు, భావోద్వేగాల మధ్య వారు తమ కుటుంబ సభ్యులనుసొరంగాల రక్షణలో నైపుణ్యం ఉన్న నిపుణులు కలుసుకున్నారు. కైలాష్ మానస సరోవర్ యాత్రకు వెళ్లిన వారు మృత్యుముఖం నుంచి బయటపడిన తీరును వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. కొండల పైనుంచి వరద సునామీలా దూసుకొచ్చిందని, టిమురె ప్రాంతంలోని మార్కెట్ మొత్తం తమ కళ్లముందే కొట్టుకుపోయిందని గద్గదస్వరంతో చెప్పారు. అనేక కష్టాలు పడి బార్డర్ పోలీస్ అవుట్‌పోస్ట్‌కు చేరుకున్న తమిళనాడు యాత్రికులకు నేపాల్ సైనికులు, అధికారులు ఆశ్రయం కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కాఠ్‌మాండూ నుంచి దిల్లీ మీదుగా ఎయిర్?ఇండియా విమానంలో వారు చెన్నైకి చేరుకున్నారు. తమను కాపాడిన నేపాల్ సైన్యానికి, తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాలకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

# మనసు మార్చుకున్న నేపాల్- విదేశీ సహాయ బృందాల రాకకు అనుమతి- 626కి చేరిన మృతుల సంఖ్య

జలప్రళయంతో కనీవినీ ఎరుగనిరీతిలో దెబ్బతిన్న నేపాల్ మనసు మార్చుకుంది. వరద సహాయచర్యల కోసం విదేశీసాయం అవసరం లేదన్న తన నిర్ణయంపై వెనక్కి తగ్గింది. విదేశీ సహాయ బృందాల రాకకు అంగీకరించింది. భారత్, చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా దేశాలకు చెందిన సహాయ నిపుణులను అనుమతించింది. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటం, విదేశీయులు భారీగా గల్లంతు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట్లో తమ సైన్యమే సహాయ చర్యలు చేపడుతుందన్న బాలేంద్ర షా ప్రభుత్వం అంతర్జాతీయంగా ఒత్తిడి పెరగటంతో వెనక్కి తగ్గింది. నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ కేంద్రం అంచనాల తర్వాత, విదేశీ నిపుణులు, సాంకేతిక బృందాలకు అనుమతి మంజూరు చేసింది. టన్నెల్స్‌లో చిక్కుకున్న వారిని రక్షించడం, డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాలను గుర్తించటానికి ఈ బృందాలు సాయం అందించనున్నాయి. 11 మంది సభ్యులతో కూడిన భారత నిపుణుల బృందం నేపాల్ చేరుకుంది. నేపాల్ ప్రభుత్వ సూచన మేరకు వైద్యులు, టన్నెల్ రెస్క్యూ నిపుణులను పంపినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఈ నిపుణుల బృందం వరద



ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నట్లు పేర్కొంది.ఆందోళనకర రీతిలో పెరుగుతున్న మృతుల సంఖ్యఇదిలా ఉండగా, నేపాల్‌లో సంభవించిన ఘోర విపత్తులో మృతుల సంఖ్య ఆందోళనకరరీతిలో పెరుగుతోంది. నేపాల్? ప్రభుత్వం వెల్లడించిన నివేదికల ప్రకారం, ఇప్పటివరకు 626 మంది చనిపోయారు. గల్లంతయిన వారి సంఖ్య 2000కు పైనే ఉంది. ప్రభావిత ప్రాంతాల్లో సహాయకచర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 5000 మంది నేపాల్ ఆర్మీతో సహా మొత్తం 11,000 మందికి పైగా భద్రతా బలగాలు సహాయచర్యల్లో పాల్గొన్నాయి. వరద ప్రభావిత ప్రాంతాలను డిజాస్టర్ జోన్లుగా ప్రకటించిన నేపాల్ ప్రభుత్వం 2,500 మందిని సహాయ బృందాలు రక్షించినట్లు వెల్లడించింది. వారిలో 113మంది భారతీయులతో సహా 163మంది విదేశీయులు ఉన్నారని ప్రకటించింది. అయితే, మృతదేహాల ను భద్రపరచడానికి ఆసుపత్రుల్లో స్థలం కొరత ఏర్పడింది. బురదలో కూరుకుపోయిన మృతదే హాలను వెలికితీసే క్రమంలో వాటి సంఖ్య అంతకంతకు పెరిగిపోతోందని, వాటిని భద్రపరిచేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానిక అధికారులు పేర్కొన్నారు. త్రిశూలి, నారాయణి నదుల చిత్వాన్ పరివాహక ప్రాంతంలో దాదాపు 200 మృతదేహాలను వెలికితీసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి మృతదేహాలు వస్తూనే ఉన్నందున, వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.దెబ్బతిన్న విద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు, వంతెనలువరద ప్రభావానికి జల విద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. త్రిశూలి, రసువా ప్రాంతాల్లోని వివిధ జల విద్యుత్ ప్రాజెక్టుల సొరంగాల్లో చిక్కుకున్న191మంది కార్మికులను అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ధుంచే, త్రిశూలి వద్ద ఏర్పాటు చేసిన అత్యవసర వైద్యకేంద్రాల ద్వారా 1,706 మందికి వైద్య సాయం అందించారు. వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో గత నాలుగు రోజులుగా మూసివేసిన ముగ్లింగ్–ఖాట్మండు ప్రధాన రహదారిని తిరిగి తెరిచారు. దీంతో దారిమధ్యలో నిలిచిపోయిన ప్రయాణికులకు భారీ ఊరట లభించింది.విపత్తు సహాయ నిధికి విరాళాల వెల్లువవరద ప్రభావిత ప్రాంతాలను నేపాల్ ప్రభుత్వం డిజాస్టర్ జోన్లుగా ప్రకటించింది. బాధితులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం 36 గంటల్లోనే కోట్లాది రూపాయలు జమయ్యాయి. శుక్రవారం రాత్రి వరకు 2.295 బిలియన్ల విరాళాలు అందినట్లు నేపాల్ ప్రధాని కార్యాలయ వర్గాలు తెలిపాయి. 10 మిలియన్ల రూపాయలు, అంతకంటే ఎక్కువ విరాళం ఇచ్చే సంస్థల మంత్రి స్వర్ణిమ్ వాగ్లే స్వయంగా విరాళాలను స్వీకరిస్తున్నారు. ఈ తాజా విరాళాలతో ఫండ్ బ్యాలెన్స్ 4.09 బిలియన్లకు చేరుకుంది.

# సీఎం కాన్వాయ్‌ను అడ్డుకుని.. వాదనకు దిగిన కాంగ్రెస్ నేత

**తిరువనంతపురం:**



కాంగ్రెస్ నేత ఒకరు సీఎం కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. తాము ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రావాలని వాదనకు దిగా రు. ఈ నేపథ్యంలో ఆ కాంగ్రెస్ నేతను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేరళలో ఈ సం ఘటన జరిగింది. సాంఘిక సంస్కర్త నారాయణ గురు జయంతి సందర్భంగా శుక్రవారం చెంపా జంతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం సతీశన్ కాన్వాయ్‌లో బయలుదేరారు. అయితే చెంతి ప్రాంతంలో కూడా నారాయణ గురు జయంతి కార్యక్రమాన్ని అక్కడి కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆ కార్యక్రమంలో పాల్గొనాలంటూ సీఎం సతీశన్ కాన్వాయ్‌ను వారు అడ్డుకున్నారు.కాగా, వాహనం నుంచి దిగిన సీఎం సతీశన్, తిరువ నంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నాయకుడు అనిల్ కుమార్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరి గింది. కొద్ది నిమిషాల తర్వాత సీఎం సతీశన్ తిరిగి తన వాహనంలోకి ఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయారు. చెంతిలో జరిగిన కార్యక్రమం తన అధికారిక షెడ్యూల్‌లో భాగం కాదని సీఎం సతీశన్ కార్యాలయం ఆ తర్వాత స్పష్టం చేసింది.మరోవైపు తిరువనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నాయకుడు అనిల్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం కాన్వాయ్‌ను అక్రమంగా అడ్డుకోవడం, నేరపూరిత బెదిరింపులు, ప్రభుత్వ అధికార విధులకు ఆటంకం కలిగించడం వంటి అభియోగాలకు సంబంధించిన పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. నిందితుడు ముఖ్యమంత్రిని దూకుడుగా నిలదీశాడని, ముందుగా నిర్ణయించిన కార్యక్రమం అయినప్పటికీ ఆయన ఎందుకు హాజరుకాలేదని గట్టిగా ప్రశ్నించాడని పోలీసులు ఆరోపించారు. దూకుడుగా ప్రవర్తించవద్దని సీఎం సూచించినప్పుడు, 'నాకు కోపం వస్తే ఏం చేస్తారు?' అని నిందితుడు బెదిరించాడని, తద్వారా ముఖ్యమంత్రిని బహిరంగంగా అవమానించడమే కాకుండా కాన్వాయ్‌తో పాటు ఉన్న పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే, సీఎం వాహనాన్ని అడ్డుకున్నారన్న ఆరోపణలను డీసీసీ నేత అనిల్ కుమార్ ఖండించారు. వాదన సమయంలో సీఎం సతీశన్ ప్రవర్తన 'కాలేజీ విద్యార్థులు కొట్టుకుంటున్నట్లు'గా ఉన్నదని ఆయన విమర్శించారు. వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించినప్పుడు మీడియాతో అనిల్ కుమార్ మాట్లాడారు. 'ఇది పార్టీ వర్గ రాజకీయాల్లో భాగం. వర్గతత్వమే సమస్య' అని ఆయన అన్నారు.

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక

# సంపాదకీయం


## నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు !

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక పక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఏ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఏ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి పక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.

## సహాయక చర్యలపై సందిగ్ధత

### - ఎట్టకేలకు విదేశీ నిపుణల రాకకు నేపాల్ అంగీకారం

**ఖాఠ్మండ్,ఆగస్ట్29:** జలప్రళయ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు సహకరిస్తామంటూ పలు దేశాలు ముందుకురాగా.. నేపాల్ ఆ అభ్యర్థనలను తొలుత తిరస్కరించింది. ఇప్పుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. విదేశీ సహాయక బృందాలను దేశంలోకి అనుమతించేందుకు అంగీకరించింది. తమ బృందాలు సహాయక చర్యలు నిర్వహించగలవని, విదేశీ బృందాలను అనుమతించబోమని ఇటీవల నేపాల్ వెల్లడించింది. అయితే గల్లంతయిన వారిలో పలు దేశాల ప్రజలు ఉన్నారు. దాంతో సహాయక చర్యల్లో భాగం అవుతామని ఆయా దేశాల నుంచి వచ్చిన దౌత్యపరమైన ఒత్తిడి కారణంగా చివరకు నేపాల్ ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. సొరంగాల్లో రక్షణ చర్యలు చేపట్టగల సిబ్బంది, డీఎన్ఏ టెస్టింగ్, ఫోరెన్సిక్ పరీక్షలు చేయగల అంతర్జాతీయ బృందాలనే అనుమతించాలని భావిస్తోంది. నిర్దిష్ట విభాగాల్లో.. పరిమిత సంఖ్యలోనే రెస్క్యూటీమ్స్‌కు అనుమతి తెలపనున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. పొరుగుదేశం నేపాల్‌కు భారత్ నుంచి అత్యవసర సహాయం అందుతోంది. తాజాగా 10 టన్నుల సామగ్రితో మూడో విమానం ఆ దేశంలో ల్యాండ్ అయింది. అలాగే 11 మంది బృందం కూడా వెళ్లింది. వారిలో వైద్యులు, సొరంగాల వద్ద సహాయక చర్యలు నిర్వహించగల సిబ్బంది, ఇతరులు ఉన్నారు. ఇక నేపాల్ వరదల్లో చిక్కుకున్న 84 మంది భారతీయుల్ని కాపాడారు. వారిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన 21 మంది భారత్‌కు చేరుకున్నారు. 320 మంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదని భారత ప్రభుత్వం వెల్లడించింది. ఇక ఈ విలయంలో మృతుల సంఖ్య 616కి చేరింది. 2400 మందికిపైగా గల్లంతయ్యారని నేపాల్ పోలీసులు వెల్లడించారు.



# నేపాల్‌లో మృత్యుంజయులు

### చనిపోయారనుకున్న ఇద్దరు తనయులు రాక

### కన్నీటి పర్యంత నుంచి తేరుకున్న తల్లి ఆనందబాష్పాలు

**ఖాఠ్మండ్,ఆగస్ట్29:** నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదలకు 616 మంది మృతిచెందగా, సుమారు 2,500 మంది గల్లంతయ్యారు. ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. ఎన్నో కుటుంబాలు తమ వారిని కోల్పోయి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. ఇదే సమయంలో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. రెండు రోజుల తర్వాత వారిద్దరూ ప్రాణాలతోనే ఉన్నారని తెలుసుకుని ఊపిరి పీల్చుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు పలువురిని కంటతడి పెట్టిస్తోంది. రాసువా జిల్లాకు చెందిన మట్టి మాయా తమాంగ్ (28) అనే మహిళకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్దవాడు జోయల్ ఘలే (8). బుధవారం ఉదయం వారిద్దరూ పాఠశాలకు వెళ్లగా.. కొద్దిసేపటికే భారీ శబ్దం వినిపించడంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన తమాంగ్‌కు భయానక దృశ్యం కనిపించింది. వరద నీరు, బురద, రాళ్లు భారీగా ప్రవహిస్తూ ఆ ప్రాంతాన్ని ముంచెత్తాయి. ఇదే క్రమంలో పాఠశాల భవనాన్నీ వరద నీరు ధ్వంసం చేసింది. పిల్లలు వరదల్లో కొట్టుకుపోయి ఉంటారని భావించిన తమాంగ్.. వారిని వెతుక్కుంటూ పలు సహాయక శిబిరాలు తిరిగింది. అయినా వారి ఆచూకీ మాత్రం ఎక్కడా దొరకలేదు. దీంతో కుమారులిద్దరూ చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. అయితే చిన్నారి జోయల్ ప్రాణాలతో బయటపడ్డాడు. వరద సమయంలో ఓ స్నేహితుడితో కలిసి పాఠశాల నుంచి అడవిలోకి పారిపోయాడు. వరద నీటి నుంచి తప్పించుకునేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో అతని కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చేతులు, ముఖానికీ గాయాలయ్యాయి. గురువారం నాడు బాలుడిని గుర్తించిన పోలీసులు.. నువాకోట్ జిల్లాలోని 15 పడకల చక్ర దేవ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖాఠ్మాండూ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఓ జర్నలిస్టు సహాయంతో జోయల్ ఆచూకీని తమాంగ్ గుర్తించింది. వెంటనే ఆస్పత్రికి చేరుకుని కుమారుడిని కలుసుకుంది. జోయల్‌ను చూసే వరకూ అతను బతికే ఉన్నాడన్న విషయాన్ని తమాంగ్ నమ్మలేకపోయింది. ఒక్కసారిగా కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. అప్పటికే చిన్న కుమారుడు కూడా దొరకడంతో కథ సుఖాంతమైంది. 8 ఏళ్ల బాలుడు చెట్టు ఎక్కి వరదల నుంచి తప్పించుకొని సురక్షితంగా బయటపడ్డాడు. ఎట్టకేలకు రెండు రోజుల తర్వాత తన తల్లిని తిరిగి కలుసుకోగలిగాడు. నేపాల్‌కు చెందిన జోయల్ ఘలే, అతడి సోదరుడు బుధవారం పాఠశాలకు వెళ్లారు. ధాడింగ్ జిల్లాల్లో వరదల ధాటికి పలు స్కూళ్లు కొట్టకుపోయాయి. స్థానికంగా ఉన్న ఓ చెట్టును పట్టుకొని జోయల్ ఘలే ప్రాణాలు కాపాడుకున్నాడు. ఒళ్లంతా గాయాలతో రోజంతా చెట్టుపైనే ఉండి సహాయం కోసం ఎదురు చూశాడు. అతడిని రక్షించిన సహాయక బృందాలు వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్చాయి. తన ఇద్దరు కుమారుల కోసం అనేక శిబిరాల్లో వెతికినా ఎక్కడా వారి ఆచూకీ దొరక్కపోవడంతో ఆశలు వదులు కున్నానని బాలుడి తల్లి మాయా తమాంగ్ పేర్కొన్నారు. తన కుమారుడు బతికే ఉన్నట్లు అధికారుల నుంచి సమాచారం అందడంతో నమ్మలేక పోయానన్నారు. అనంతరం మరో కుమారుడిని కూడా స్థానిక అధికారులు రక్షించినట్లు తమకు సమాచారం అందిందని సంతోషం వ్యక్తం చేశారు. తమ పిల్లలను కాపాడిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేపాల్ వరదల్లో మరో విషాదం

- ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో
- లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

**న్యూఢిల్లీ,ఆగస్ట్29:** నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది.

ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది.

కాగా.. నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి.

ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి.

ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది.

అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు.

తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

# నేపాల్ విలయం



నేపాల్‌లో జల ప్రళయం వేలాది కుటుంబాలకు కన్నీళ్లను మిగిల్చింది. హిమాలయాల ఎత్తుల్లో కదిలిన మంచు, రాళ్లు, మట్టి చివరకు భోటేకోశీ నదిని ఉగ్రప్రవాహంగా మార్చాయి. ఇండ్లు, వంతెనలు, రహదారులు, విద్యుత్ మౌలిక వసతులు కొట్టుకుపోయాయి. తమవారు వస్తారేమోనని ఎదురుచూస్తున్న కుటుంబాలు, ఆచూకీ కోసం సాగుతున్న గాలింపు చర్యలు, శిథిలాలుగా మిగిలిన జీవితాలు ఆ దేశ విషాదాన్ని మరింత హృదయ విదారకంగా మారుస్తున్నాయి. ఈ దృశ్యాలు ప్రపంచాన్నే కంటతడి పెట్టించాయి. తాజా నివేదికల ప్రకారం వేయికి పైగా ప్రాణాలు బలయ్యాయి. గల్లంతైన చాలామంది ఆచూకీ ఇంకా దొరకడం లేదు. ప్రస్తుతం వరదనీరు వెనక్కివెళ్లినా, దానివెంట కొట్టుకుపోయిన బతుకులు, మిగిల్చిన శూన్యం, కుటుంబాల గుండెల్లో నింపిన వేదన మాత్రం ఇంకా అక్కడే ఉంది. ఈ విపత్తు ఎలా సంభవిం చిందని చర్చించుకోవడంకంటే ఏం నేర్పుతున్నదన్నదే ముఖ్యం. ఇది కేవలం వరద కాదు, పర్వతం కదిలితే నది ఎలా మారుతుంది, నది మారితే మనిషి జీవితం ఎంతవేగంగా ఛిన్నాభిన్నమవుతుందో చూపించిన విధ్వంసం. హిమాల యాల్లో మారుతున్నది కేవలం మంచు పరిమాణం కాదు. మంచు, శిలలు, పర్వత వాలులు, నదుల మధ్య ఉన్న సహజ సమతుల్యత కూడా. ఈ ఘటనలో కూడా హిమనదంలోని భారీ భాగం కూలి, మంచు,రాళ్లు,మట్టి కలిసి నదీ ప్రవాహాన్ని అడ్డుకోవడం, ఆ అడ్డంకి తెగిపోవడంతో విధ్వంసక ప్రవాహం ఏర్పడినట్లు తెలుస్తోంది. అంటే విపత్తు నదిలో మొదలుకాలేదు, పర్వతంలో మొదలై నదిని మార్చి, చివరకు మనిషి జీవితాన్ని కూల్చింది. నేపాల్‌లో పర్వత ప్రాంతాల్లో పర్యాటకం, చిన్న వ్యాపారాలు, వ్యవసాయం, జలవిద్యుత్, సరిహద్దు వాణిజ్యం పరస్పరం అనుసం ధానమై ఉన్నాయి. రహదారులు, వంతెనలు తెగిపోవడమంటే మార్కెట్లు దూరమవడం, విద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతినడమంటే ఆదాయం తగ్గడం, పర్యాటక మార్గాలు మూసుకుపోవడమంటే వేల కుటుంబాల ఉపాధి దెబ్బతినడం. అందుకే ప్రకృతి విపత్తు పేదరికాన్ని మరింత లోతుగా చేసే ప్రమాదం కలిగిస్తుంది. అయితే, నేపాల్ ఇప్పటికే రాజకీయంగా పెద్ద మార్పును అనుభవిస్తున్న సమయంలో ఈ విపత్తు వచ్చింది. గతేడాది యువత అసంతృప్తి, పాత రాజకీయ వ్యవస్థపై వ్యతిరేకత, అవినీతి, పాలనా వైఫల్యాలపై జెన్-జీ ఆగ్రహం కొత్త రాజకీయ శక్తికి దారితీశాయి. బలేంద్ర షా నేతృత్వంలోని ప్రభుత్వం ఆ మార్పునకు ప్రతీకగా అధికారంలోకి వచ్చింది. ఇలాంటి సమయంలో ప్రకృతి విపత్తు కొత్త ప్రభుత్వానికి కేవలం సహాయక చర్యల పరీక్ష కాదు, ప్రజలు కోరుతున్న కొత్త పాలన ఎంతవరకు ప్రజా భద్రతను ప్రాధాన్యంగా చూస్తుందో తేల్చే పరీక్ష కూడా. ఈ ఘటనకు నేపథ్యంగా హిమాలయాల మారుతున్న స్వభావాన్ని చూడాలి. ఉష్ణో గ్రతలు పెరుగుతున్న కొద్దీ హిమనదాలు గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ (జిఎల్ఓఎఫ్)కూడా ఇదే ప్రమాద శ్రేణిలో భాగం. హిమనదాలు కరుగు తున్నప్పుడు ఏర్పడే సరస్సులకు సహజంగా మంచు, మట్టి, రాళ్ల అడ్డుకట్టలు ఉంటాయి. అవి బలహీనపడితే భారీ నీటి ప్రవాహం ఒక్కసారిగా దిగువకు దూసుకుపోతుంది. ప్రస్తుత విపత్తుపై కూడా అలాంటి విశ్లేషణలు వెలుబడుతున్నాయి. ఈ సమయంలో పాలకుల 'అభివృద్ధి నమూనా'ను కూడా పునఃపరిశీలించాలి. పర్వతాలు భరించే సామర్థ్యాన్ని పట్టించు కోకుండా రహదారులు, సొరంగాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక నిర్మాణాలు పెంచడం ప్రమాదాన్ని పెంచుతుంది. అభివృద్ధి అవసరం. కానీ, ప్రకృతిని లెక్కచేయని అభివృద్ధి చివరకు అభివృద్ధి చేసిన మనిషినే బలి తీసుకునే పరిస్థితి రాకూడదు. అదే నేపాల్ పాలనా వ్యవస్థలోని లోపాల్ని కూడా బహిర్గత పరిచింది. ఇది భారత్‌కు కూడా హెచ్చరికే. హిమాలయ నదులు రాజకీయ సరిహద్దులను గుర్తించవు. నేపాల్‌లో పుట్టే ఆకస్మిక వరదలు దిగువన భారత నదీ పరివాహక ప్రాంతాలను ప్రభావితం చేయగలవు. భారతీయులు కూడా గల్లంతైనవారిలో ఉన్నట్టు వార్తలొస్తు న్నాయి. కుటుంబాలు తమవారి సమాచారం కోసం ఎదురుచూస్తున్నాయి. అందువల్ల నేపాల్ విషాదం పొరుగు దేశం ఎదుర్కొంటున్న సమస్యగా కాకుండా మన ఉమ్మడి హిమాలయ భద్రతకు సంబంధించిన అంశంగా చూడాల్సిన అవసరం ఉంది. భారత్ సహా అనేక దేశాలు నేపాల్‌కు మానవతా సహాయం అందించేందుకు ముందుకొచ్చాయి. అది తక్షణ ప్రాణ రక్షణకు అవసరం. కానీ, సహాయం తర్వాతి దశ పునర్నిర్మాణం మాత్రమే కాకుండా విపత్తు మళ్లీ మహావిపత్తుగా మారకుండా చేసే శాస్త్రీయ వ్యవస్థ నిర్మాణం కావాలి. భారత్, నేపాల్, చైనా, భూటాన్ మధ్య హిమ నదాలు, మంచు సరస్సులు, వర్షపాతం, నదీ ప్రవాహాలు, భూస్కలనాలపై నిరంతర సమాచార మార్పిడి అవసరం. ఉపగ్రహాలు, సెన్సార్లు, డ్రోన్లు, రియల్‌టైమ్ నదీ గేజ్‌లను అనుసంధానించి ముందస్తు హెచ్చరిక వ్యవస్థను నిర్మించుకోవాలి. ఈ విపత్తు నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సిన పాఠమిదే.

# మీ భర్తదే పెత్తనమా - ఇలా చేయాలంటున్న నిపుణులు!



భార్యాభర్తల్లో ఇద్దరూ సమానమే. కానీ, కొంతమంది భర్తలు తమ భార్యలపై అన్ని విషయాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శిస్తుంటారు. ఇలాంటి వారిని ‘ూశ్రీజూష్టుు ఎబంఎ్ఖఅఎ అని అంటారు. అయితే, ఇలాంటి వాళ్లతో గొడవకు దిగకుండా, అదే సమయంలో ఆత్మ గౌరవాన్ని కోల్పోకుండా సమస్యను పరిష్కరించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!నచ్చజెప్పండి : దంపతుల మధ్య ఏ గొడవ ఉన్నా కలిసి కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారమవుతుందట. ఆధిపత్యం ప్రదర్శించే భర్త విషయంలోనూ ఇది వర్తిస్తుందంటున్నారు నిపుణులు. అయితే, ఎదుటి వ్యక్తి కోపంలో ఉన్నప్పుడు ఏం చెప్పినా వారికి అర్థం కాదని చెబుతున్నారు. అందుకే, తను కాస్త ప్రశాంతంగా ఒకచోట కూర్చున్నప్పుడు వెళ్లి.. తన ప్రవర్తన వల్ల మీరు ఎంత ఇబ్బంది పడుతున్నారో విడమరిచి చెప్పాలని సూచిస్తున్నారు. మీ ఇద్దరి మధ్య జరిగే గొడవల వల్ల ఇటు మీరు, అటు పిల్లలు ఎంతలా సతమతమవుతున్నారో వాళ్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. అలాగే, వారు అలా ప్రవర్తించడానికి గల కారణాలేంటో కూడా ప్రేమ పూర్వకంగానే అడిగి తెలుసుకోవాలని చెబుతున్నారు. ఇలా ఇద్దరి మధ్య జరిగే సానుకూల చర్చ నెమ్మదిగానైనా మీ భాగస్వామిలో మార్పు తీసుకొచ్చే అవకాశం ఉందంటున్నారు.రాత్రి పడుకునే ముందు ఇలా చేస్తే – ముఖం అందంగా మెరిసిపోతుందట! ఆధారపడద్దు : ఆర్థిక స్వేచ్ఛ ఉన్న మహిళల కంటే.. వ్యక్తిగతంగా, ఆర్థికంగా తమపై ఆధారపడే భార్యల విషయంలోనే చాలా మంది భర్తలు ఆధిపత్యం ప్రదర్శించాలని చూస్తుంటారు. ఈ క్రమంలో తమ భార్యలను తక్కువ చేసి మాట్లాడటం, చూడటం లాంటివి చేస్తుంటారు. వాళ్ల అభిప్రాయాలను, నిర్ణయాలను ఏ మాత్రం లెక్క చేయారు. ఇలాంటి భర్తలతో వేగలేక, తాము పడుతోన్న బాధను ఎవరితో చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతుంటారు చాలా మంది. ఇలాంటప్పుడు.. మీలో ప్రతిభ ఉంటే, మిమ్మల్ని మీరు నిరూపించుకోగలరన్న నమ్మకం ఉంటే ఎవరికీ తలవంచాల్సిన అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. మీ చదువు, ట్యాలెంట్?కి తగ్గ ఉద్యోగం వెతుక్కునే ప్రయత్నం చేయమంటున్నారు. ఇందుకు మీ భర్త అడ్డుపడినట్లయితే.. ఇద్దరి సంపాదన ఉంటే అది కుటుంబానికే మంచిదని సానుకూలంగా మాట్లాడే ప్రయత్నం చేయాలని సలహా ఇస్తున్నారు. ఇలా మీ కాళ్ల మీద మీరు నిలబడగలిగితే ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం రెట్టింపవుతాయని పేర్కొంటున్నారు. ఇది పరోక్షంగా అనుబంధానికి మేలు చేస్తుందని తెలియజేస్తున్నారు.ఆఖరి ప్రయత్నంగా : ఎదుటివారు తమను తక్కువ చేసి చూస్తున్నారంటే.. కోపం కట్టలు తెంచుకోవడం సహజం. అలాగని, ఎంత ప్రయత్నించినా వాళు మారట్లేదని.. మీరూ వాళ్లలాగే గట్టిగా అరవడం, గొడవకు దిగడం అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా చేస్తే సమస్య పరిష్కారమవకపోగా.. మరింత జఠిలమవుతుందని చెబుతున్నారు. కాబట్టి, ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోతే.. ఆఖరి ప్రయత్నంగా ఇద్దరూ కలిసి మానసిక నిపుణుల దగ్గరికి కౌన్సెలింగ్?కి వెళ్లాలని సూచిస్తున్నారు. తద్వారా, మీ భర్త ప్రవర్తనకు గల కారణాలేంటో తెలుసుకొని, వాళ్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వడం, ఇద్దరితో మరోసారి మాట్లాడడం వంటివి చేస్తారట. దీనివల్ల కొంత వరకు ఫలితం ఉండచ్చని చెబుతున్నారు.

# భారత కార్ మార్కెట్లో సరికొత్త చరిత్ర- 4.7 లక్షల విక్రయాలు

భారత ఆటోమొబైల్ రంగానికి జులై నెల బాగా కలిసొచ్చింది. దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్ జులై 2026లో రికార్డు స్థాయి అమ్మకాలతో దూసుకెళ్లింది. ఈ ఒక్క నెలలోనే ఏకంగా 4.7 లక్షల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలోని 3.5 లక్షల యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే.. ఇది సుమారు 34 శాతం వార్షిక వృద్ధిని (శ్రీ) సూచిస్తోంది. ముఖ్యంగా ఎస్‌యూవీ (ూఖఎ) మోడళ్లకు ఉన్న ఆదరణ, ఎలక్ట్రిక్ వాహనాల (జుఎ) డిమాండ్ వేగంగా పెరగడం ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.
దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఈ నెలలో సరికొత్త చరిత్ర సృష్టించింది. జులై నెలలో మారుతి సుజుకి ఏకంగా 2 లక్షలకు పైగా కార్లను విక్రయించి, కంపెనీ చరిత్రలోనే అత్యధిక నెలవారీ దేశీయ అమ్మకాలను నమోదు చేసింది.మారుతి సుజుకి ఇండియా మార్కెటింగ్ ఘ సేల్స్ విభాగం సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపిన వివరాల ప్రకారం, గతేడాది జులైలో 1,80,526 యూనిట్లు అమ్ముడవగా, ఈ నెలలో కంపెనీ మొత్తం 2,41,421 యూనిట్లను విక్రయించింది. దీనిబట్టి మారుతి సుజుకి ఏకంగా 33 శాతం వార్షిక వృద్ధిని సాధించి మార్కెట్లో తన నంబర్ వన్ స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది.మారుతి సుజుకితో పాటు దేశంలోని ఇతర ప్రముఖ




ఆటోమొబైల్ దిగ్గజాలు కూడా జులై 2026లో రికార్డు స్థాయి విక్రయాలతో సరికొత్త రికార్డులు సృష్టించాయి. హ్యుందాయ్, టాటా మోటార్స్, కియా, నిస్సాన్ కంపెనీల అమ్మకాల వివరాలు ఇలా ఉన్నాయి:హ్యుందాయ్ ఇండియా సంస్థ భారత్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ఒక్క నెలలోనూ సాధించని విధంగా.. ఈ జులైలో అత్యధిక నెలవారీ అమ్మకాలను నమోదు చేసింది. మొత్తం 75,360 కంటే ఎక్కువ యూనిట్లను విక్రయించి, గతేడాదితో పోలిస్తే 25.4 శాతం వృద్ధిని సాధించింది.దేశీయ అమ్మకాలు: 23.3 శాతం పెరిగి 54,210 యూనిట్లకు చేరాయి. (హ్యుందాయ్ చరిత్రలోనే ఇది బెస్ట్ జులై సేల్స్). ఎగుమతులు: 31.4 శాతం పెరిగి 21,150 యూనిట్లకు చేరాయి. (గడిచిన 100 నెలల్లో ఇవే అత్యధిక ఎగుమతులు).
టాటా మోటార్స్: 59 శాతం భారీ వృద్ధిటాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (ుఖీఎ) జులైలో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో కలిపి మొత్తం 63,760 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. గతేడాది ఇదే నెలలో నమోదైన 40,175 యూనిట్లతో పోలిస్తే ఇది 59 శాతం వృద్ధిని సూచిస్తుంది. టాటా మోటార్స్ దేశీయ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 58 శాతం పెరిగి 62,611 యూనిట్లుగా నమోదయ్యాయి.
కియా ఇండియా: బెస్ట్ జులై హోల్‌సేల్ పెర్ఫార్మెన్స్‌కియా ఇండియా కూడా జులై నెలలో తన అత్యుత్తమ హోల్‌సేల్ (డీలర్లకు సరఫరా) పనితీరును నమోదు చేసింది. కంపెనీ సరఫరా చేసిన వాహనాల సంఖ్య ఏడాది ప్రాతిపదికన 27.4 శాతం పెరిగి 28,200 యూనిట్లకు చేరింది. అదే సమయంలో, జనవరి-జులై కాలంలో మొత్తం సరఫరా 1,91,949 యూనిట్లుగా నమోదైంది. ఇది గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 16.8 శాతం ఎక్కువ.నిస్సాన్ మోటార్ ఇండియా: దేశీయ మార్కెట్లో 218 శాతం జంప్‌నిస్సాన్ ఇండియా కూడా జులైలో రికార్డు స్థాయి హోల్‌సేల్ అమ్మకాలను సాధించింది. కంపెనీ మొత్తం 9,339 యూనిట్ల వాహనాలను సరఫరా చేసింది. ముఖ్యంగా దేశీయ హోల్‌సేల్ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 218 శాతం పెరిగి 4,518 యూనిట్లకు చేరగా, ఎగుమతులు 4,821 యూనిట్లుగా నమోదయ్యాయి.

# చదువుల్లో అద్భుతంగా రాణించాలా? పరిహారాలు చేసుకోండిలా!



నవగ్రహాలలో గురు గ్రహానికి మంచి స్థానముంది. విద్యార్థులు చదువులో చురుగ్గా ఉండాలన్నా, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నా గురువు అనుగ్రహం ఎంతో ముఖ్యం. గురువు అనుగ్రహం లేకుంటే మందబుద్ధిగా ఉండడం, పరీక్షల్లో తరచుగా వైఫల్యం చెందడం వంటివి జరుగుతుంటాయి. విద్యార్థులు చదువులో ఉన్నత స్థితికి చేరుకోవడానికి గురువు బోధనలు పాటించడం ఎంత ముఖ్యమో నవగ్రహాలలో గురువు అనుగ్రహం కూడా అంతే అవసరం. ఈ కథనంలో విద్యార్థులు గురువు అనుగ్రహం కోసం పాటించాల్సిన పరిహారాలు గురించి తెలుసుకుందాం.

### గురువారం పరిహారం!

పిల్లల బంగారు భవిష్యత్తు, విద్యాభివృద్ధి కోసం పిల్లలతో తరచుగా గణపతి, సరస్వతి పూజ సూర్యనమస్కారం, హయగ్రీవ స్తోత్రాలు చేయిస్తుండాలి. విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తు, వారు క్రమశిక్షణతో మంచి అలవాట్లు, ఆలోచనలతో కూడిన విద్యార్జన సాధన కోసం శివ స్వరూపమైన దక్షిణామూర్తిని ఆరాధించాలి. ఇది మాత్రమే కాకుండా గురు గ్రహ అనుకూలత కోసం శాస్త్రంలో సూచించిన మరికొన్ని పరిహారాలు కూడా తెలుసుకుందాం.

### దక్షిణామూర్తి ఆరాధన

గురు గ్రహ అనుకూలత కోసం గురువారం రోజు శివాలయంలో ప్రతిష్ఠించి ఉన్న దక్షిణామూర్తి ఎదురుగా పసుపు రంగు వస్త్రం పైన బియ్యం పిండితో తయారు చేసిన రెండు చిన్న ప్రమిదలు పెట్టి, ఒక్కో ప్రమిదలో రెండేసి వత్తులు వేసి, నేతి దీపాలు పెట్టాలి. దీపాలను కుంకుమతో అలంకరించాలి. పిదప భక్తి శ్రద్ధలతో దక్షిణామూర్తి స్తోత్రం పారాయణ చేయాలి. నానబెట్టిన పచ్చి శనగలు దండగా కూర్చి, ఆ మాలను దక్షిణామూర్తికి వేయాలి. ఇలా 9 గురువారాలు చేస్తే కోరుకున్న చోట చదువుకునే అవకాశాలతో పాటు విదేశాలలో విద్యార్జనకు ఉన్న ఆటంకాలు కూడా తొలగుతాయి.

### కొబ్బరి చిప్పలో దీపారాధన

దత్తాత్రేయ స్వామి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి రెండు చిప్పల్లో కొబ్బరి నూనె పోసి వత్తులు వేసి దీపారాధన చేయాలి. ఈ పరిహారం కూడా 9 గురువారాలు పాటించాలి. ఇలా చేయడం వల్ల విద్యార్థుల్లో తెలివితేటలు పెరిగి చదువులో చురుగ్గా ఉంటారు.

### గోపూజ

గురువారానికి లక్ష్మీవారమని కూడా పేరుంది. గురువారం శ్రీ మహాలక్ష్మి స్వరూపమైన గోవును పసుపు కుంకుమలతో పూజించి, నానబెట్టిన శనగలు తినిపించడం వల్ల ఉన్నత విద్యావకాశాలు మెరుగు పడతాయి. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నవారికి మంచి ఉద్యోగం లభిస్తుంది. అలాగే గోమాతకు గురువారం రోజు చపాతీలు తినిపించడం వలన ఆకస్మిక గండాలు తొలగుతాయి. గురువారం గోమాతకు గ్రాసం తినిపిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.

బలహీనంగా ఉన్నప్పుడు ప్రసిద్ధ గురు క్షేత్రాలను సందర్శించడం ఉత్తమ ఫలితాలనిస్తుంది. మన దేశంలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లోని బృహస్పతి ధామ్ ప్రసిద్ధ గురు క్షేత్రం. అలాగే కుయివారం శ్రీ మహాలక్ష్మి స్వరూపమైన గోవును పసుపు కుంకుమలతో పూజించి, నానబెట్టిన శనగలు తినిపించడం వల్ల ఉన్నత విద్యావకాశాలు మెరుగు పడతాయి. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నవారికి మంచి ఉద్యోగం లభిస్తుంది. అలాగే గోమాతకు గురువారం రోజు చపాతీలు తినిపించడం వలన ఆకస్మిక గండాలు తొలగుతాయి. గురువారం గోమాతకు గ్రాసం తినిపిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.

బలహీనంగా భకోణంలో గురుస్థానం ప్రత్యేకమైన గురు క్షేత్రం. అలాగే వారణాసిలోని ద

### దత్త పారాయణ

దత్తాత్రేయ స్వామి జీవిత చరిత్ర అయిన గురు చరిత్ర ప్రతి గురువారం పారాయణ చేయడం వల్ల గురుగ్రహ అనుగ్రహం పరిపూర్ణంగా లభిస్తుంది. కుటుంబంలో ఆర్థిక సమస్యలు తొలగి పోతాయి.

### గురు క్షేత్రాల దర్శనం

జాతకంలో గురు గ్రహం బలహీనంగా ఉన్నప్పుడు ప్రసిద్ధ గురు క్షేత్రాలను సందర్శించడం ఉత్తమ ఫలితాలనిస్తుంది. మన దేశంలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లోని బృహస్పతి ధామ్ ప్రసిద్ధ గురు క్షేత్రం. అలాగే కుంభకోణంలో గురుస్థానం ప్రత్యేకమైన గురు క్షేత్రం. అలాగే వారణాసిలోని దశాశ్వమేధ ఘాట్ వెళ్లే మార్గంలో ఉన్న శ్రీ బృహస్పతి మహాదేవ్ మందిర్ కూడా ప్రసిద్ధ గురు క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఉత్తరాఖండ్ రాష్ట్రం నైనిటాల్ జిల్లా సమీపంలో సముద్ర మట్టానికి సుమారు 8000 అడుగుల ఎత్తులో ఉన్న దేవ గురు పర్వతంపై వెలసిన బృహస్పతి ఆలయం కూడా ప్రసిద్ధ గురు క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇవి కాకుండా ప్రముఖ దత్త క్షేత్రమైన గాణగాపూర్, కురుపురం, శిర్డీ సాయినాథుని ఆలయం కూడా ప్రసిద్ధి చెందిన గురు క్షేత్రాలు. ఈ ఆలయాలను దర్శించడం వల్ల గురు గ్రహ దోషాలు తొలగి సకల శుభాలు చేకూరుతాయి.

### పిల్లలు మాట వినడం లేదా!

ఒకవేళ పిల్లలు ఇలాంటి పూజలు చేయడానికి ఇష్టపడని సందర్భాలలో పిల్లల తరఫున వారి తల్లిదండ్రులు ఈ పూజలు చేయడానికి శాస్త్రం అనుమతిస్తుంది. కాబట్టి పిల్లలే పూజలు చేయాలని అనుకోకుండా వారి తరఫున పెద్దలు కూడా ఈ పూజలు చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు పొందవచ్చు.
విద్యార్థులకు చదువులో ఆటంకాలు తొలగించి వృత్తి పరమైన పురోగతి అందించే ఈ గురువారం పరిహారాలు పాటించడం వల్ల విద్యాపరమైన అభివృద్ధితో పాటు సకల శుభాలు పొందవచ్చు.

### ఓం శ్రీ గురుభ్యోనమః!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# తిరుమల శ్రీవారి గర్భగుడిలో ఉన్న 5 విగ్రహాలు ఏంటో తెలుసా పంచబేరాల విశిష్టత ఇదే!



కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసుడు వెలసిన తిరుమల భూలోక వైకుంఠంగా విరాజిల్లుతోంది. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే ఏడుకొండల వానిగా పూజలందుకుంటున్న ఆనందనిలయంలో పూజలందుకునే 5 విగ్రహాలలో దేనిని దర్శించినా మూలమూర్తిని దర్శించినట్లే అని వేంకటాచల మహాత్యంలో వివరించి ఉంది.పంచబేరాలుశ్రీవారి గర్భగుడిలో మూల విగ్రహంతో పాటుగా కౌతుక బేరం, ఉత్సవబేరం, స్నపన బేరం, బలిబేరం అనే విగ్రహాలు పూజలందుకొంటాయి. అంటే మొత్తంగా ఐదు విగ్రహాలుంటాయి. అవి వరుసగా ధ్రువబేరం, కౌతుక బేరం, స్నపన బేరం, ఉత్సవబరం, బలిబేరం. వైఖానస ఆగమం ప్రకారం పూజలుఈ ఐదు విగ్రహాలు శ్రీ వైష్ణవ వైఖానస ఆగమం ప్రకారం సందర్భోచితంగా పూజలందుకొంటాయి. దక్షిణ భారతదేశంలోని అనేక వైష్ణవాలయాలు ఇదే వైఖానస లేదా పాంచరాత్ర ఆగమ సంప్రదాయాలను అనుసరిస్తాయి. అయితే తిరుమల క్షేత్రం వైఖానస ఆగమాన్నే ప్రధానంగా పాటిస్తుంది. ఇప్పుడు ఏ మూర్తిని ఎందుకు ప్రార్థిస్తారో చూద్దాం.ధ్రువబేరంగ్రామ శ్రేయస్సు కొరకు ధ్రువబేరానికి పూజలు నిర్వహిస్తారు. ధ్రువబేరమంటే మరేమి కాదు మూలవిగ్రహమే. దీన్నే స్థిరమైన, చలించని విగ్రహంగా భావిస్తారు కనుకనే “ధ్రువ” అనే పేరు వచ్చింది. వైఖానసనాగము ప్రకారము గర్భగుడిలోని దేవుడు రెండు రకాలు. ఒకటి కంటికి కనిపించే బేరము, అంటే సాకార రూపమన్నమాట. రెండోది కంటికి కనబడని దేవుడు. ఈ దేవుడినే నిరాకారరూపుడని అంటారు. కనుక తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుని స్వరూపం సాకారమన్నమాట.కౌతుక బేరంసాధారణంగా మూలబేరాన్ని శిల, మట్టి, దారువు అంటే చెక్కలతో నిర్మించాలి. వీటికే నిత్యపూజలు వైఖానస లేదా పాంచరాత్ర ఆగమాల ప్రకారం పూజలు జరపాలి. ధ్రువబేరానికి అభిషేకముండదు, ఎందుకంటే మూల విగ్రహం అత్యంత పవిత్రమైనదిగా, స్పర్శకు అతీతమైనదిగా భావించబడుతుంది. పాలు నేయి తేనె పెరుగు వంటి వాటితో తిరుమంజన సేవ, అభిషేకాలు కౌతుకబేరానికి చేస్తారు. కౌతుకబేరమంటే దినసరిపూజకు ఏర్పాటుచేసిన బంగారు, వెండి లేదా పంచలోహాలతో చేసిన విగ్రహం. మూలవిగ్రహంలో వుండే శక్తిని కౌతుకబేరములోకి ఆవాహన చేసి పూజలు నిర్వహించి, సాయంత్రం పూజ ద్వారా తిరిగి ఆ శక్తిని మూలవిగ్రహంలోనికి ప్రవేశపెడతారు. ఉద్వాసనమంటారు.ఉత్సవబేరంమూడోదైన విగ్రహం ఉత్సవ విగ్రహం. పుర ఊరేగింపునకు ధ్రువబేరాన్ని తీసుకువెళ్ళటానికి వీలుకాదు కనుక ఉత్సవబేరాన్ని ఊరేగిస్తారు. తిరుమలలో పిలుస్తారు. బ్రహ్మోత్సవాలు వంటి పర్వదినాలలో వాహనసేవలకు ఈ మూర్తినే ఊరేగిస్తారు.స్నపన బేరంస్నపనబేరాన్ని అమ్మవారి విగ్రహాలతో పాటుగా కోనేరుకు తీసుకువెళ్లి చక్రవారి స్నానం చేయిస్తారు. సాధారణంగా తిరుమంజన సేవలన్నీ ఈ స్నపనబేరానికే జరుగుతాయి.బలిబేరంప్రతి దేవాలయంలో ప్రధాన మూర్తితో పాటు పరివార దేవతలుంటారు. వీరిని ఉపదేవాలయాలలో ఉంచి పూజిస్తారు. గరుడ, నంది, వినాయక, శ్రీదేవి భూదేవి, భైరవ, పరశురామ, బలరామ, యక్షగంధర్వ దేవతలు ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చును. చివరిది ఐదవదైన బలిబేరాన్ని పరివార దేవతలకు బలి ఇవ్వటానికి ముందు అర్చిస్తారు. బలి ఇవ్వడమంటే జంతువధ చేయడం కాదు. మూల విగ్రహానికి నివేదన చేసిన అనంతరం ఈ దేవతలకు బలి అన్నమును సమర్పిస్తారు. కొన్ని ఆగమవిధానాలలో మూలవిగ్రహానికి అభిషేకము కూడా చేస్తారు. అలాగే తిరుమల శ్రీవారి మూలమూర్తికి కూడా ప్రతి శుక్రవారం అభిషేకం జరుగుతుంది. నిరాకార రూపుడైన భగవంతునికి ఆకారపూజా విధులేమి వుండవు, భక్తిప్రవృత్తులే ఇక్కడ ప్రధానం.ఈ పంచబేరాల విధానం కేవలం తిరుమలకే పరిమితం కాక, వైఖానస ఆగమాన్ని అనుసరించే అనేక దక్షిణ భారత వైష్ణవాలయాలలో కూడా విస్తృతంగా అమలులో ఉందని ఆగమశాస్త్ర పండితులు పేర్కొంటారు. తిరుమల దర్శనానికి వెళ్లినప్పుడు మూలమూర్తితో పాటు ఇతర మూర్తులను కూడా దర్శించుకోవడం వలన అభీష్టసిద్ధి కలుగుతుందని స్కందపురాణంలో వివరించి ఉంది. ఏడుకొండలవాని అనుగ్రహాన్ని పరిపూర్ణంగా అందించే ఈ పంచబేరాల దర్శనంతో జన్మ సాఫల్యం సిద్ధిస్తుందని వేంకటాచల మహత్యంలో వివరించి ఉంది. కలియుగ వెంకటనాథుని ఈ పంచబేరాల గురించి చదివినా, విన్నా సకల సంపదలు సిద్ధిస్తాయి.ఏడుకొండలవాడా! వెంకటరమణా! గోవిందా! గోవిందా!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# ధోనీకి చెన్నై సూపర్ కింగ్స్ బంపరాఫర్!




వాటాల విషయంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మహేంద్ర సింగ్ ధోనీ విభేదాలు తలెత్తాయని ప్రచారం జరిగింది. సీఎస్‌కేలోని 25 శాతం షేర్లను తనకు అమ్మాలని ధోనీ కోరగా.. ఆ టీమ్ యజమాన్యం నిరాకరించిందని వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకు ఈ వార్తలపై ధోనీ గానీ, సీఎస్‌కే మేనేజ్‌మెంట్ కానీ స్పందించలేదు. దాంతో సీఎస్‌కేకు ధోనీ దూరంగా ఉంటాడనే అభిప్రాయం వ్యక్తమైంది. కానీ ధోనీకి చెన్నై సూపర్ కింగ్స్ బంపరాఫర్ ఇచ్చినట్లు తాజాగా ఓ నివేదిక బయటకు వచ్చింది. సీఎస్‌కే హెడ్ కోచ్‌గా లేదా కన్సల్టెంట్‌గా బాధ్యతలు చేపట్టాలని ధోనీకి ఆఫర్ ఇచ్చినట్లు సదరు రిపోర్ట్ పేర్కొంది. అయితే ఆఫర్‌పై ధోనీ ఇంకా నిర్ణయం తీసుకోలేదని, దాంతో సీఎస్‌కే మేనేజ్‌మెంట్ వేచి చూస్తుందని తెలుస్తోంది. ధోనీ నుంచి నిర్ణయం వెలువడిన తర్వాత వచ్చే సీజన్‌కు సంబంధించిన ప్రణాళికలను, వేలంలో అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎస్‌కే నిర్ణయించినట్లు సమాచారం. ఐపీఎల్ 2026 సీజన్‌లోచెన్నై సూపర్ కింగ్స్ తీవ్రంగా నిరాశపర్చింది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో 14 మ్యాచ్‌ల్లో 6 విజయాలు మాత్రమే సాధించి పాయింట్స్ టేబుల్‌లో 8వ స్థానంలో నిలిచింది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఐపీఎల్ చరిత్రలోనే ధోనీ ఒక సీజన్ మొత్తం ఆడకపోవడం ఇదే తొలిసారి.అంతేకాకుండా హెడ్ కోచ్‌గా 19 ఏళ్లు సేవలందించిన స్టీఫెన్ ఫ్లేమింగ్ కూడా జట్టును వీడాడు. 2008లో ఆటగాడిగా జట్టులోకి వచ్చిన ఫ్లెమింగ్.. 2009లో హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతని పర్యవేక్షణలో సీఎస్‌కే ఐదు టైటిళ్లు గెలిచింది. అతను తప్పుకోవడంతో సీఎస్‌కే కొత్త కోచ్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీఎస్‌కే ఆఫర్‌పై ధోనీ తేల్చిన తర్వాతే కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియను మొదలు పెట్టాలనుకుంటుంది. ధోనీ ఏ విషయం చెప్పకపోవడం వల్ల సీఎస్‌కే కార్యకలాపాలన్నీ ఆగిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఐపీఎల్ 2027 సీజన్‌లో ధోనీ ఆటగాడిగా కొనసాగడనే విషయం స్పష్టంగా అర్థమ వుతోంది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ధోనీని సీఎస్‌కే అనామక ప్లేయర్‌గా రూ.4 కోట్లకు తీసుకుంది. 2024 నుంచి 2026 వరకు సీఎస్‌కే వరుసగా ప్లే ఆఫ్స్ చేరలేదు. ఈ క్రమంలోనే ధోనీ పర్యవేక్షణలో జట్టును పునర్నిర్మించాలని సీఎస్‌కే యోచిస్తోంది.

# ఒలింపిక్స్‌తోపాటు తర్వాతి టీ20 వరల్డ్ కప్ వరకు కెప్టెన్‌గా ఉంటా...

**• స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్**




భారత టీ20 జట్టుకు 2026 వరల్డ్ కప్ ట్రోఫీని అందించిన స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అనూహ్యంగా జట్టుకే దూరం కావడంపై తొలిసారి మనసులో మాట బయట పెట్టాడు. అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్నప్పటికీ అతడి స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను సెలెక్టర్లు టీ20 కెప్టెన్‌గా నియమించడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల నుంచి సూర్యను పూర్తిగా తప్పించారు. ఈ నిర్ణయం తీసుకున్న కొన్ని నెలల తర్వాత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో జరిగిన ఇంటర్వ్యూలో సూర్యకుమార్ తన మనసులోని భావాలను పంచుకున్నాడు. జట్టు జాబితాలో తన పేరు లేకపోవడం చూసినప్పుడు తాను కేవలం నవ్వుకున్నానని చెప్పాడు. రాబోయే ఒలింపిక్స్ తో పాటు తర్వాతి టీ20 వరల్డ్ కప్ వరకు తనే కెప్టెన్‌గా ఉంటానని అనుకున్నట్లు సూర్య వ్యాఖ్యానించాడు. “జట్టు ప్రకటనలో నా పేరు కనిపించనప్పుడు ఒక్కసారిగా నవ్వాను. కెరీర్‌లో ఒత్తిడి వచ్చినప్పుడల్లా నేను రిలాక్స్‌గా ఉంటూ నవ్వుతూనే ముందుకు సాగాను. 2026 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత మరో రెండేళ్ల పాటు జట్టును ముందుకు తీసుకెళ్లగలనని, ఒలింపిక్స్ లో సారథ్యం వహిస్తానని భావించాను. అయితే సెలెక్టర్ల ఆలోచనలు వేరేలా ఉన్నాయి. భవిష్యత్తు కోసం వేరొకరు కెప్టెన్‌గా ఉంటే మంచిదని వారు భావిస్తే ఆ నిర్ణయాన్ని నేను గౌరవిస్తాను. మరొకరి నాయకత్వంలో జట్టు బాగా ఆడితే నాకు ఎలాంటి సమస్యా లేదు” అని సూర్యకుమార్ తెలిపాడు. తన తర్వాత కెప్టెన్ అయిన శ్రేయస్ అయ్యర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని, అతడు గొప్ప లీడర్ అని సూర్య కొనియాడాడు. అయితే సెలెక్టర్ల నిర్ణయం తనను తీవ్రంగా నిరాశపరిచిందని తెలిపాడు. “రెండేళ్ల కాలంలో మేం ఒక్క ద్వైపాక్షిక సిరీస్ కూడా ఓడిపోలేదు. ఆసియా కప్, టీ20 వరల్డ్ కప్ టైటిళ్లు గెలిచాం. అంతా సవ్యంగా సాగుతున్న సమయంలో ఇలాంటి ఆకస్మిక మార్పు ఎందుకు జరిగిందో నాకు అర్థం కాలేదు. గెలవగానే ఇది ఎలా సాధ్యం అనే ప్రశ్న నా మనసులో మెదిలింది. దాదాపు నెలన్నర పాటు ఇంట్లోనే కూర్చుండిపోయాను. బంధువులు, స్నేహితులు వచ్చి ఓదార్చినా వారు వెళ్లిన తర్వాత ఒంటరిగా ఉన్నప్పుడు ఆ బాధ తెలిసేది” అని పేర్కొన్నాడు. జట్టు ఎంపిక ప్రకటనకు రెండు మూడు రోజుల ముందే సెలెక్టర్లు తనకు ఫోన్ చేసి ‘ఇక వేరే మార్గంలో ముందుకెళ్లే సమయం వచ్చింది’ అని చెప్పినట్లు సూర్యకుమార్ తెలిపాడు. “వారు అలా చెప్పినప్పుడు నేను ఏమాత్రం కోపగించుకోలేదు. జట్టు మంచి కోసం వారు ఒక నిర్ణయం తీసుకున్నారు. దాన్ని హుందాగా స్వీకరించాను. దేశం కోసం ఆడటానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను. మీరు ఎప్పుడు పిలిచినా బరిలోకి దిగేందుకు నా బ్యాట్ సిద్ధంగా ఉంటుంది” అని సూర్యకుమార్ తెలిపాడు.

# బాబర్ ఆజామ్ చెత్త రికార్డ్..

పాకిస్థాన్ టెస్ట్ కెప్టెన్ బాబర్ ఆజామ్ చెత్త రికార్డ్ నమోదు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ కాలం పాటు సెంచరీ చేయని బ్యాటర్‌గా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. పాకిస్థాన్ బ్యాటింగ్ కింగ్‌గా గుర్తింపు పొందిన బాబర్ ఆజామ్.. సెంచరీల నిరీక్షణలో బౌలర్లతో పోటీపడుతున్నాడు. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో బాబర్ ఆజామ్ దారుణంగా విఫలమైన సంగతి తెలిసిందే. 10 బంతుల్లో 8 పరుగులే చేసి జోష్ టంగ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకే కుప్పకూలింది. బాబర్ ఆజామ్ 2023 నుంచి ఒక్క సెంచరీ చేయలేదు. ఈ మధ్య కాలంలో అతను 36 ఇన్నింగ్స్‌లు ఆడాడు. దాంతో 2023 నుంచి టెస్ట్‌ల్లో సెంచరీ చేయకుండా అత్యధిక ఇన్నింగ్స్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో బాబర్ ఆజామ్ బౌలర్లతో పోటీపడుతున్నాడు. ఈ జాబితాలో మిచెల్ స్టార్క్(50), పాట్ కమిన్స్(47), మహమ్మద్ సిరాజ్(44), నాథన్ లయన్(41) వంటి ప్రముఖ బౌలర్లు బాబర్ ఆజామ్ కంటే ముందున్నారు. ప్రభాత్ జయసూర్య, తైజుల్ ఇస్లామ్‌తో కలిసి బాబర్ ఆజామ్ ఈ జాబితాలో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. స్పెషలిస్ట్ బ్యాటర్ అయిన బాబర్ ఆజామ్.. బౌలర్లతో పోటీపడటంపై అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. పాకిస్థాన్ బ్యాటింగ్ కింగ్ బౌలర్లతో పోటీపడుతున్నాడని ఎగతాళి చేస్తున్నారు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ అజాన్ అవైస్(102 బంతుల్లో 7 ఫోర్లతో 46), సౌద్ షకీల్(16) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్(4/11) నాలుగు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్(3/26) మూడు వికెట్లు పడగొట్టాడు. జోష్ టంగ్(2/27) రెండు వికెట్లు తీసాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌటైంది. జోర్డాన్ కాక్స్(55), జేమీ స్మిత్(61) హాఫ్ సెంచరీతో రాణించగా.. గస్ అట్కిన్సన్(45), జోష్ టంగ్(30 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. పాకిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ అబ్బాస్(4/73) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ అలీ(3/86) మూడు వికెట్లు పడగొట్టాడు. ఖుర్రమ్ షెహ్‌జాద్, అలీ ఉస్మాన్ తలో వికెట్ తీసారు. 180 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 81 పరుగులు చేసింది. ప్రస్తుతం ఇంగ్లండ్ 261 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లోనూ పాకిస్థాన్‌కు ఘోర పరాజయం తప్పేలా లేదు.







# సౌతాఫ్రికాపై నమీబియా సంచలన విజయం!

ఓడలు బళ్ళు అవుతాయి, బళ్ళు ఓడలవుతాయి” అంటే ఇదేనేమో. వరల్డ్ బెస్ట్ క్రికెట్ టీమ్‌లో ఒకటైన సౌతాఫ్రికాకు బిగ్ షాక్ తగిలింది. పసికూన నమీబియా చేతిలో ఘోర పరాభావం ఎదురైంది. జింబాబ్వే, నమీబియా, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న ముక్కోణపు టీ20 సిరీస్‌లో సఫారీ టీమ్ శుభారంభం చేయలేకపోయింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించి నమీబియా 18 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. ఈ విజయంతో నమీబియా సరికొత్త చరిత్రను లిఖించింది. అంతర్జాతీయ టీ20ల్లో సౌతాఫ్రికాపై నమీబియాకు ఇది రెండో విజయం. గతేడాది జరిగిన ట్రై సిరీస్‌లోనూ నమీబియా 4 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. దాంతో సౌతాఫ్రికాను రెండు సార్లు ఓడించిన తొలి అసోసియేట్ టీమ్‌గా నమీబియా చరిత్రకెక్కింది. టీ20ల్లో సౌతాఫ్రికాను నెదర్లాండ్స్ ఒకసారి ఓడించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2022లో ఆ జట్టు ఈ విజయం సాధించింది. మరే అసోసియేట్ టీమ్ సౌతాఫ్రికాను ఓడించలేదు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. జాన్ ఫ్రైలింక్(38 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 60) హాఫ్ సెంచరీతో రాణించగా.. లౌరెన్ స్టీన్‌కాంప్(29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41) దూకుడుగా ఆడాడు. సౌతాఫ్రికా బౌలర్లలో ప్రేనెలన్ సుబ్రాయెన్ మూడు వికెట్లు తీయగా.. డాన్ జాన్సెన్, బ్యోర్న్ ఫోర్టుయిన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. న్కోబాని మోకోయెనా, డెవాల్డ్ బ్రెవిస్ తలో వికెట్ తీసారు. అనంతరం సౌతాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్లకు 145 పరుగులే చేసి ఓటమిపాలైంది. డెవాల్డ్ బ్రెవిస్(50 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 75) రాణించినా ఫలితం లేకపోయింది. చివరి ముగ్గురు బ్యాటర్లు డకౌట్‌గా వెనుదిరగడం సౌతాఫ్రికా కొంపముంచింది. అయితే ఈ ముక్కోణపు సిరీస్‌కు సౌతాఫ్రికా ప్రధాన ఆటగాళ్లంతా దూరంగా ఉన్నారు. ద్వితీయ శ్రేణి టీమ్‌తో సౌతాఫ్రికా ఈ సిరీస్ ఆడుతోంది. ఏది ఏమైనా.. సౌతాఫ్రికాపై నమీబియా విజయం హాట్‌టాపిక్‌గా మారింది.

# జర్మనీని చిత్తు చేసిన టీమిండియా

బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2026 ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత మహిళల హాకీ జట్టుకు హాకీ ఇండియా 50 లక్షల రూపాయల భారీ నగదు పురస్కారాన్ని అనౌన్స్ చేసింది. ఆమ్‌స్టెల్‌వీన్ వేదికగా జరిగిన 5/6 క్లాసిఫికేషన్ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 5 జట్టు జర్మనీని 3-1 తేడాతో ఓడించి భారత జట్టు ఐదో స్థానంలో నిలిచింది. 1974 లో జరిగిన ప్రారంభ ఎడిషన్‌లో నాల్గో స్థానం సాధించిన తర్వాత, గత 52 ఏళ్ల వరల్డ్ కప్ చరిత్రలో భారత మహిళల జట్టు నమోదు చేసిన అత్యుత్తమ ఫలితం ఇదే. టోర్నీ ఆద్యంతం కేవలం నెదర్లాండ్స్ చేతిలో మాత్రమే ఓడిన భారత్, బలమైన చైనా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్లను డ్రాలతో నిలువరించి, సౌతాఫ్రికాను 6-1 తో చిత్తు చేసింది. ఈ ఘనతపై హాకీ ఇండియా ప్రెసిడెంట్ పద్మశ్రీ దిలీప్ టిర్కీ స్పందిస్తూ జట్టును కొనియాడాడు. “భారత మహిళల హాకీ చరిత్రలో ఇది నిజంగా ఒక అద్భుతమైన ఫలితం. 52 ఏళ్ల తర్వాత ప్రపంచకప్‌లో ఐదో స్థానాన్ని దక్కించుకోవడం జట్టు కఠిన శ్రమ, పోరాట పటిమకు నిదర్శనం. మా ప్రశంసలకు గుర్తుగా జట్టుకు 50 లక్షల రూపాయల నగదు బహుమతిని ప్రకటిస్తున్నాను. ఇది రాబోయే టోర్నీల్లో మరింత ఉన్నత స్థాయికి చేరేందుకు ప్లేయర్లకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను” అని తెలిపాడు. హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ కూడా మాట్లాడుతూ కెప్టెన్ సలీమా టెటే బృందం దేశం గర్వించేలా చేసిందని, ఆసియన్ గేమ్స్ కు ముందు ఇది గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని పేర్కొన్నాడు. తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనగా గోల్స్ నమోదు కాకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. భారత గోల్ కీపర్ బిచ్చు దేవి, డిఫెన్స్ విభాగం జర్మనీ పెనాల్టీ కార్నర్లను సమర్థవంతంగా అడ్డుకున్నాయి. అయితే హాఫ్ టైమ్ తర్వాత భారత జట్టు దూకుడు పెంచి, ఫలితాన్ని సాధించింది. 43వ నిమిషంలో ఇషికా చౌదరి రివర్స్ లిఫ్ట్ షాట్‌తో తొలి గోల్ సాధించి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించింది. ఆ తర్వాత నిమిషంలోనే దక్కిన పెనాల్టీ కార్నర్‌ను నవ్‌నీత్ కౌర్ గోల్‌గా మార్చడంతో స్కోరు 2-0 తో డబులైంది. 47వ నిమిషంలో నవ్‌నీత్ కౌర్ మరోసారి అద్భుత ఫీల్డ్ గోల్ చేసి ఆధిక్యాన్ని 3-0 కి పెంచింది. 59వ నిమిషంలో జర్మనీ తరఫున లిన్ క్రింగ్స్ ఒక గోల్ సాధించి లోటును తగ్గించినప్పటికీ, భారత జట్టు పట్టు సడలించలేదు. వెటరన్ గోల్ కీపర్ సవితా పూనియా ఆఖరి క్వార్టర్‌లో కీలకమైన పెనాల్టీ కార్నర్‌ను నిలువరించి భారత్ విజయాన్ని ఖాయం చేసింది. చీఫ్ కోచ్ జోర్డ్ మారిజ్నే మార్గదర్శకత్వంలో భారత్ 3-1 తో మ్యాచ్‌ను ముగించి ప్రపంచ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించింది.




# ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం

**హైదరాబాద్ :** గాయం కారణంగా 2026 సీజన్‌లో మిగతా పోటీలకు భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా దూరమయ్యాడు. శిక్షణ సమయంలో తన చీలమండకు గాయమైందని, దీంతో రాబోయే ఆసియా క్రీడలకూ దూరమవుతున్నానని శనివారం నీరజ్ ప్రకటించాడు. పూర్తిగా కోలుకుని, మరింత బలంగా తిరిగి రావడంపైనే తన దృష్టి ఉందని పేర్కొన్నాడు.






# ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల


నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.




# నాగార్జున వందో సినిమా కింగ్ 100 గ్లింప్స్ విడుదల

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు.

# ఇరుముడి నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమ్‌కు రెడీ




మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' . ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక్' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్టాం÷-రగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. ÷ూజా సమాచారం ప్రకారం, ప్రముఖ దిగ్గజ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ 'నెట్‌ప్లిక్స్' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ప్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.

--------------

# మహేంద్రగిరి వారాహి ట్రైలర్ విడుదల




టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. వారాహికి ఎదురెళ్లి ఈ శాపాన్ని తప్పిస్తాను' అంటున్నారు సుమంత్. మహేంద్రగిరి రాజ వంశస్థులకు వారాహి అమ్మవారి శాపం ఎలా తగిలింది? అందుకు కారణం ఏంటి? మరి అన్నట్లుగానే ఆ శాపం ఏంటో కథానాయకుడు కనుగొన్నాడా? శాప విమోచనకు ఏం చేశాడు? అన్నది తెలియాలంటే 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిందే. సుమంత్ హీరోగా దర్శకుడు సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మాళవికా నాయర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ సెప్టెంబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదలైంది. ఆద్యంతం థ్రిల్ పంచేలా మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

# బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్



ప్రస్తుతం సమంత తల్లికాబోతున్న ఆనందంలో ఉన్నారు. ఒకవైపు బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్.. మరోవైపు వ్యాయామం చేస్తూ అభిమానులతో ఫొటోలు పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టా వేదికగా ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. కొందరు తల్లులు ఆమెకు సలహాలు ఇవ్వగా.. మరికొందరు ఆమెతో వారి అనుభవాలు పంచుకున్నారు. బేబీ కోసం కావాల్సిన వస్తువులన్నీ కొన్నాను. వాటిని చూస్తుంటే కాస్త కంగారుగా ఉంది. అందుకే ప్రస్తుతానికి వాటిని ప్యాక్ చేసి ఆ బ్యాగ్‌ను ఒక లాప్‌టాప్ స్టాండ్‌గా వాడుతున్నానన్నారు. ప్రెగ్నెన్సీతో ఉన్నప్పటి నుంచి నాకు కలలు వస్తున్నాయి. మీకు కూడా వస్తున్నాయా అంటూ ప్రశ్నలు వేస్తున్నారు. నిజంగానే.. ఈ విచిత్రమైన కలల గోల ఏంటో అర్థం కావట్లేదు.

మరోవైపు11 కేజీలు పెరిగాననన్నారు. కొత్తగా తల్లి అయిన తర్వాత చాలా మార్పులు వస్తాయట.

నేను ఆ క్షణాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. పుట్టినవారికి పాలు పట్టడం, జోలపాడి నిద్రపోయేలా చేయడం.. ఈ పనులు ఫుల్ టైమ్ జాబ్‌లా మారిపోతాయి. అది చాలా అందమైన, గొప్ప అనుభూతి. జీవితాన్ని మార్చే అనుభవం. మాతృత్వం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మాతృత్వం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఇప్పటి వరకు తెలియదు. నేను ఊహించలేదు కూడా. మంచి విషయాన్ని తెలిపారు. ధన్యవాదాలు అంటున్నారు. పుట్టబోయే బిడ్డకు ఏం పేరు పెడతారంటే ..ఓ పేరును ఎంచుకోవడం చాలా కష్టం.. దీనికి మీ అందరి సహాయం కావాలి. స్కానింగ్ రిపోర్ట్స్ వచ్చేదాక చాలా టెన్షన్‌గా ఉంటుంది. అయితే ఈ కొత్త దశను పూర్తిగా ఆస్వాదిస్తున్నానని సమంత ఆనందంగా చెప్పారు.



# టాక్సిక్ భారీ షాక్!

## 'ధురంధర్ 2', 'పుష్ప 2' కంటే వెనుకబడిన 'టాక్సిక్'



యశ్ నటించిన భారీ బడ్జెట్ గ్యాంగ్‌స్టర్ చిత్రం 'టాక్సిక్' బాక్సాఫీస్ వద్ద రెండో రోజు భారీగా వెనకడుగు వేసింది. తొలి రోజు రూ.100 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకెళ్లిన ఈ సినిమా.. రెండో రోజు మాత్రం గణనీయంగా తగ్గింది. 'ధురంధర్ 2', 'పుష్ప 2', 'కేజీఎఫ్ 2' వంటి భారీ చిత్రాల రెండో రోజు వసూళ్ల స్థాయిని అందుకోలేకపోయింది.

ఆగస్టు 26న విడుదలైన 'టాక్సిక్' తొలి రోజు దేశీయంగా రూ.101.10 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. రెండో రోజు రూ.36.40 కోట్లకే పరిమితమైంది. తొలి రెండు రోజుల్లో దేశీయంగా రూ.137.50 కోట్ల నెట్, రూ.164.50 కోట్ల గ్రాస్ వసూలు చేసింది.విదేశాల్లో రెండో రోజు రూ.10 కోట్లు రాబట్టింది. దీంతో ఓవర్సీస్ గ్రాస్ రూ.26.25 కోట్లకు చేరింది. రెండు రోజుల ప్రపంచవ్యాప్త గ్రాస్ వసూళ్లు రూ.190.75 కోట్లుగా నమోదయ్యాయి.రెండో రోజు వసూళ్లలో హిందీ వెర్షన్ రూ.23 కోట్లు రాబట్టి ముందంజలో నిలిచింది. కన్నడ వెర్షన్ రూ.8.50 కోట్లు, తెలుగు వెర్షన్ రూ.3 కోట్లు వసూలు చేశాయి. తమిళంలో రూ.1.50 కోట్లు, మలయాళంలో రూ.40 లక్షలు వచ్చాయి.అయితే 'ధురంధర్ 2' రెండో రోజు రూ.80.72 కోట్లు, 'పుష్ప 2' రూ.93.80 కోట్లు, 'కేజీఎఫ్ 2' రూ.90.50 కోట్లు వసూలు చేశాయి. 'ఆర్ఆర్ఆర్' రెండో రోజు రూ.86.70 కోట్ల నెట్ సాధించింది. ఈ చిత్రాలతో పోలిస్తే 'టాక్సిక్' రెండో రోజు జోరు బాగా తగ్గింది.

# 'ప్రళయ్' గురించి లీకులిస్తున్న లోకబ్యూటీ



దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ కల్యాణి ప్రియదర్శన్ బాలీవుడ్ అరంగేట్రానికి సిద్ధమయ్యారు. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ -ప్రళయ్- చిత్రంతో హిందీ పరిశ్రమలో అడుగుపెడుతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా కల్యాణి సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ.. ఈ మూవీ స్క్రిప్ట్ మొదటి పేజీ ఫోటోను షేర్ చేయడంతో ఈ లీకులు ఇప్పుడు ఇండస్ట్రీలో వైరల్‌గా మారాయి.ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన ప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. ముంబైలో షెడ్యూల్ చేస్తున్నారని సమాచారం. ఈ ఏడాది తన కుటుంబంతో కలిసి ఓనం పండుగను జరుపుకోలేకపోయానని కల్యాణి తెలిపారు. సాంప్రదాయ ఓనం -సద్య-తో పాటు పండుగ వేడుకలను మిస్ అవుతున్నా.. -ప్రళయ్- ప్రాజెక్ట్ కోసం పూర్తిగా దృష్టి సారించినట్లు కల్యాణి పేర్కొన్నారు. పండుగ సంబరాలకు దూరమైనా.. కొత్త ప్రయాణం విషయంలో ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు కల్యాణి అభిమానులతో షేర్ చేసారు. ఈ సినిమా కథాంశం ఎంతో వైవిధ్యంగా ఉండబోతోందని సమాచారం. ఒక -డిస్టోపియన్- నేపథ్యంలో -జాంబీ అపోకలిప్స్- ఎలిమెంట్స్‌తో కూడిన ఎమోషనల్ సర్వైవల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రానుంది. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి ఒక వ్యక్తి చేసే పోరాటాన్ని, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు ముంబైలో వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు హన్సల్ మెహతా కుమారుడు జై మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. ఆయనకు ఇది దర్శకుడిగా తొలి సినిమా కావడం విశేషం

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569